సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 21-6-2024 ₹15/-

# త్యాగోత్సవం





రచయితలకు, పాఠకులకు,
ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు
**ఈదుల్ అజ్‌హా**
శుభాకాంక్షలు

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 25 హైదరాబాద్
శుక్రవారం 21 జూన్ 2024 రూ.15-00
14 జిల్ హిజ్జా 1445 హిజ్రీ

**తొలిగీటు**

హజ్ చేయాలని
నిశ్చయించుకున్న వ్యక్తి
హజ్ చేయడానికి
త్వరపడాలి.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షరీఫ్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com



30

**'జమ్‌జమ్' నీటి ప్రశస్తి**

## లోపల...

| | | |
|---|---|---|
| త్యాగోత్సవ సందేశం | ...... | 04 |
| త్యాగోత్సవం | ...... | 05 |
| ఇబ్రాహీం (అ) జీవితం స్ఫూర్తిదాయకం | ...... | 08 |
| క్రీడాధన శ్రేష్ఠుడు - 34 | ...... | 10 |
| హజ్ విశ్వాసులందరికీ అది మార్గదర్శక కేంద్రం | ...... | 14 |
| త్యాగాల పర్వం... ప్రేమకు ప్రతిరూపం | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| చరితార్థులు-2 : హుస్సేన్ రహీం | ...... | 21 |
| ఖుర్బానీ ప్రాశస్త్యం | ...... | 22 |
| నమాజ్ కొరకు పిలుపు అజాన్ | ...... | 27 |
| మనోవాంఛల దాస్యం జీవితంపై వేసే దుష్ప్రభావం | ...... | 28 |
| బంధుత్వాలు - మానవతా విలువలు | ...... | 33 |

**కమనీయం, రమణీయం..**



త్యాగాలకు ప్రతిరూపం
యిబ్రాహీమ్ ఆచరణ
సదా కాలమంతవరకు
కావాలి మనకు ప్రేరణ!
ప్రవక్త వారి విధానమే
మనకు ఆచరణీయం
కలలో మెలకువలోను
అదేనండి రమణీయం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## త్యాగోత్సవ సందేశం

**ఇది హజ్జ్ మాసం.** ప్రపంచం నలుమూలల నుండీ ఇబ్రాహీమ్(అ) అనుయాయులైన లక్షలాది మంది ప్రజలు పవిత్ర మక్కాలోని కాబా గృహానికి చేరుకుని హజ్జ్ విధిని నెరవేరుస్తున్నారు. మహా తల్లి హాజిరా (అలైహస్సలామ్) పాద చిహ్నాలలో నడిచి మొక్కవోని ఆమె సాహసాన్ని, పట్టుదలను స్మరించుకుంటున్నారు. జమరాత్‌పై రాళ్లు రువ్వి దుష్ట శక్తులను ఎల్లకాలం సహించేది లేదంటూ ప్రతినబూను తున్నారు. 'మినా'లో ఖుర్బానీని సమర్పించి తమ నమాజ్, తమ సకల ఉపాసనా రీతులు, తమ జీవనం, తమ మరణం సమస్తం సకల లోకాల ప్రభువు అల్లాహ్ కొరకేనని, ఆయన సహవర్తులెవరూ లేనివాడనీ, విధేయతా భావంతో తలవంచే వారిలో తాము ముందు వరుసలో ఉంటామని క్రియాత్మ కంగా నిరూపించుకుంటున్నారు.

ప్రవక్తల పితామహుడైన ఇబ్రాహీమ్(అ) దుష్టశక్తులతో జీవిత కాలమంతా రాజీలేని పోరాటం సాగించారు. ప్రభువు ఆయనకు ఎప్పుడు ఏ పరీక్ష పెట్టినా, అందులో పూర్తిగా నికార్సుగా నెగ్గుకు వచ్చారు. సత్యవాక్కు సమున్నతికై దేశ దేశాలు సంచరించారు. ఆఖరికి వృద్ధాప్యంలో కలిగిన కన్న కొడుకును సయితం - దైవ సంకేతంపై- దైవ మార్గంలో సంతోషంగా సమర్పించుకోవడానికి సన్నద్ధులయ్యారు.

ఆయన త్యాగనిరతికి సంతసించి దేవుడు ఆయనకు సమస్త మానవాళికి పీష్వాగా చేయబోతున్నప్పుడు, 'ప్రభూ! ఈ పుర స్కారం నా వరకేనా? నా సంతానానికి కూడా ఇది వర్తిస్తుందా?' అని ఆయన ఎంతో ఆశతో విన్నవించుకోగా, "దుర్మార్గుల విషయంలో నా వాగ్దానం వర్తించద"ని ప్రభువు స్పష్టం చేశాడు. మానవాళికి సన్మార్గం చూపే కార్యక్రమం విషయంలో దైవప్రవక్తల కాంక్ష ఎంత తీవ్రంగా ఉంటుందో దీని ద్వారా అర్థం చేసుకోవచ్చు.

దివ్యఖుర్‌ఆన్‌లో మహనీయ ఇబ్రాహీమ్ (అ) ప్రస్తావన డెబ్బయి కన్నా ఎక్కువసార్లే వచ్చింది. ప్రస్తావన వచ్చిన ప్రతి చోటా ఇబ్రాహీమ్(అ) విశిష్ఠత ద్యోతకమవుతూనే ఉంటుంది. ఉదాహరణకు ఒక చోట, "నిజానికి ఇబ్రాహీమ్ తనకుతానే ఒక సంఘం" (16: 120) అని అనబడింది. ఆయన తన ఉనికి రీత్యా ఒకే వ్యక్తి కావచ్చు. కాని అసాధారణమైన తన త్యాగాల దృష్ట్యా, అనితర సాధ్యమైన తన పోరాటాల రీత్యా, నియంతల ఎదుట ప్రదర్శించిన మొక్కవోని సాహసం రీత్యా ఆయన ఒక వ్యక్తి కాదు. ఆయన ఒక్కరే ఒక సంస్థ, ఒక వ్యవస్థ, ఒక సముదాయం, ఒక అనుసరణీయ నాయకుడు! ఆయన ఒక్కరే ఒక సైన్యం. అందుకే దేవుడు ఆయన్ని తన కార్యం కొరకు ప్రత్యేకంగా ఎన్నుకున్నాడు. ప్రపంచంలోనూ ఆయనకు మేలును ప్రసాదించాడు. పరలోకంలోనయితే ఆయన నిశ్చయంగా సజ్జనుల సరసన ఉంటారు (16: 122). అంతేకాదు, "(ఓ ముహమ్మద్-స!) ఏకాగ్రచిత్తుడవై ఇబ్రా హీమ్ విధానాన్ని అనుసరించు. అతను ముష్రిక్కులలోని వాడు కాడు" అనే సందేశాన్ని మేము నీ వద్దకు పంపాము (16: 123) అని తన చివరి ప్రవక్తకు సయితం మార్గబోధన చేశాడు ఆ పరమ ప్రభువు.

చివరకు ముహమ్మద్ సముదాయాన్ని ఉద్దేశించి, "మీ తండ్రి ఇబ్రాహీమ్(అ) ధర్మంపై స్థిరంగా ఉండండి" (22: 78) అని ప్రత్యేకంగా ఉపదేశించటం గమనార్హం.

నాలుగు వేల ఏండ్ల క్రితం మహనీయ ఇబ్రాహీమ్(అ) కాలంలో ఉన్న పరిస్థితులే ఇప్పుడూ ఇంచుమించు ఉన్నాయి. ప్రజాస్వామ్యం ముసుగులో ఏక సత్తాక, నిరంకుశ నియంతృత్వ ధోరణులు చాపకింద నీరులా పారుతున్నాయి. సత్యం కోసం, న్యాయం కోసం, ధర్మం కోసం ఉద్యమించే వారు ఫాసిస్టు శక్తుల కరాళ దంష్ట్రాల క్రింద నలిగిపోయే పరిస్థితులు ఇప్పటికీ ఉన్నాయి.

**ఆగ్ హై, ఔలాదె ఇబ్రాహీమ్‌హై, నమ్రూద్ హై**
**క్యా కిసీకో ఫిర్ కిసీకా ఇమ్తిహా మఖ్సూద్ హై?**

ఒక్కోసారి సిఎఎ, ఎన్నార్సీల బూచి చూపెట్టి భయపెడతారు. ఒక్కోసారి కామన్ సివిల్‌కోడ్ ఖడ్గాన్ని వ్రేలాడదీస్తుంటారు. ఒక్కోసారి ముస్లిం రిజర్వేషన్లను ఎత్తేస్తామంటారు, ఒక్కోసారి రాజ్యాంగాన్నే మార్చేస్తామంటారు. ఒక్కోసారి దీని మదర్సా లను మూసివేయిస్తామంటారు. పేరుకు అతి పెద్ద సెక్యులర్ ప్రజాస్వామ్యమే. కాని పెత్తందార్ల భోజ్యం అన్న చందాన వ్యవస్థ సాగిపోతోంది. ప్రజాస్వామ్యం నేతి బీరకాయలా మారుతోంది. సామాజిక న్యాయం దొరకని దినుసు అయి పోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో 'ఈదె ఖుర్బానీ' (త్యాగోత్సవం) మన నుండి వాంఛించేదేమిటో ఆత్మావ లోకనం చేసుకోవలసిన ఆవశ్యకత ఉంది.

కవరు కథనం అబ్దుల్ వాహెద్




# త్యాగోత్సవం

**దైవమార్గంలో** త్యాగం చేయడమన్నది ఇస్లాంలో చాలా ముఖ్యమైన విషయం. దీనికి ఇస్లాంలో సుదీర్ఘ చరిత్ర ఉంది. తొలి మానవుడు, ప్రవక్త ఆదం (అస) సంతానంలో ఇద్దరు సోదరులు హాబిల్, ఖాబీల్ కథ త్యాగనిరతి ఎలా ఉండాలో స్పష్టం చేస్తుంది. వారిద్దరు సమర్పించిన త్యాగం చరిత్రలో మొట్టమొదటిది. హాబీల్ భక్తి ప్రపత్తులు, చిత్తశుద్ధి వల్ల అల్లాహ్ అతని త్యాగాన్ని స్వీకరించాడు. కాని ఖాబీల్ స్వార్థంతో ఆలోచించాడు. అందువల్ల అతని ఖుర్బానీని దైవం స్వీకరించ లేదు. ఈ ఉదాహరణ ఖుర్బానీలో ఉన్న ముఖ్యమైన సూత్రాన్ని నొక్కి చెబుతుంది. మనం చేసే త్యాగంలో భక్తి, చిత్తశుద్ధి, దైవప్రేమ చాలా ముఖ్యమైనవి. ఈ విషయంలో దివ్యఖుర్ఆన్ ఏం చెప్పిందో చూద్దాం –

“వాటి (ఖుర్బానీ పశువుల) మాంసమూ అల్లాహ్‌కు చేరదు, వాటి రక్తమూ చేరదు. కాని మీ భయభక్తులు ఆయనకు చేరుతాయి.” (హజ్ : 37)

దివ్య ఖుర్ఆన్‌లోని ఈ వాక్యం చాలా స్పష్టంగా ఖుర్బానీ అంతరార్థమేమిటో తెలియజేస్తోంది. ఖుర్బానీలో జంతువును వధించడం అనేది ఒక ప్రతీకాత్మక చర్య మాత్రమే. జంతువును బలి చేసినట్లుగానే అవసరమైతే ధనప్రాణాలను దైవం కోసం బలివ్వడానికి సిద్ధమన్న ప్రకటన ఈ ఆచరణ వెనుక ఉంది. అల్లాహ్ మార్గంలో తన కెంతో ఇష్టమైన సంపదను, సంతతిని దేన్నయినా త్యాగం చేయడానికి సంసిద్ధతను ప్రకటించడమే ఖుర్బానీ.

ఇస్లామీయ కేలండరులోని జుల్ హిజ్జ మాసంలో హజ్ యాత్ర జరుగుతుంది. హజ్ యాత్ర చేస్తున్న భక్తులు హజ్ యాత్ర సందర్భంగా అక్కడ ఖుర్బానీ ఇస్తారు. హజ్ యాత్ర ఇస్లాం ఐదు మూలస్తంభాలలో ఒకటి. స్థోమత కలిగిన ప్రతి ముస్లిం తప్పనిసరిగా జీవితంలో ఒకసారి హజ్ యాత్ర చేయాలి. హజ్ యాత్రకు ఖుర్బానీకి మధ్య చాలా దగ్గరి సంబంధం ఉంది. హజ్ యాత్రలో ఉన్న ముస్లిములు ఎలాగూ హజ్ యాత్రలో భాగంగా ఖుర్బానీ ఇస్తారు, హజ్ యాత్రలో లేని ముస్లిములు, ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో హజ్ యాత్రలో తాము పరోక్షంగా పాలుపంచుకుంటూ తమ తమ ప్రాంతాల్లో బక్రీద్ లేదా ఈదుజ్జుహా పండుగ చేసుకుంటారు. తమ తమ ప్రాంతాల్లో ఖుర్బానీ ఇస్తారు. క్లుప్తంగా అర్థమయ్యేదేమిటంటే, బక్రీద్ లేదా ఈదుజ్జుహా పండుగ నిజానికి హజ్ యాత్రకు సంబంధించిన పండుగే. హజ్ యాత్ర మక్కా నగరంలో జరుగుతుంది. మక్కాకు బయట ఉన్న ముస్లిములు వివిధ దేశాల్లో బక్రీద్ పండుగ రూపంలో హజ్ యాత్రతో తమ అనుబంధాన్ని ప్రకటిస్తారు.

హజ్ యాత్ర, ఈదుజ్జుహా పండుగ, ఖుర్బానీ– ఈ మూడూ

ప్రవక్తల పితామహుడు హజ్రత్ ఇబ్రాహీం (అస)తో సంబంధమున్నవి. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో అనుచరులు "ఓ దైవప్రవక్తా, ఈ ఖుర్బానీ ఏమిటి?" అని అడిగినప్పుడు ఆయన జవాబిస్తూ, "ఇది మీ పితరులైన హజ్రత్ ఇబ్రాహీం (అస) సంప్రదాయం" అన్నారు.

హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం జీవిత ఉద్యమం ప్రపంచ మానవాళికి సత్యసందేశ ప్రచారోద్యమం. ఈ ఉద్యమం కోసం ఆయన ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలి వెళ్ళారు. తన మొత్తం కుటుంబాన్ని ఈ బృహత్కార్యంలోనే ఆయన పెట్టారు. ఈ సందేశ ప్రచారోద్యమానికి కేంద్రంగా ఆయన కాబాగృహాన్ని నిర్మించారు. కాబా ప్రదక్షిణలు చేశారు.

ఈ ప్రపంచంలో తన పరుగు ప్రయత్నాలన్నీ కేవలం అల్లాహ్ కోసమే అని ప్రకటించారు. తన జీవితాన్ని పూర్తిగా అల్లాహ్ కోసమే, అల్లాహ్‌కే అంకితమై జీవించే దృఢసంకల్పాన్ని ఖుర్బానీ చేయడం ద్వారా ప్రకటించారు.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యత్తు గురించి చెప్పిన ఒక మాట నిజానికి హెచ్చరికలాంటిది. ఆయన ఏమన్నారంటే, రాబోయే కాలంలో సంపన్నులు విహారయాత్రగా హజ్ యాత్ర చేస్తారు. మధ్యతరగతి వ్యాపారం కోసం హజ్ చేస్తారు. మతపండితులు ప్రదర్శన కోసం, పేరు కోసం హజ్ చేస్తారు. పేదలు బిచ్చమెత్తడానికి హజ్ చేస్తారని చెప్పారు.

ఈ హదీసు నిజానికి భయంగొలిపే హదీసు. ఈ హదీసు వెలుగులో ముస్లిములు ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

హజ్రత్ ఇబ్రాహీం గురించి ఖురాన్లోని 37వ సూరాలో ప్రస్తావన ఉంది. ఆయన తాను చూసిన కలలో దైవాదేశాన్ని పాటించడానికి తన కుమారుడైన ఇస్మాయీలు (అస) ప్రాణాన్ని త్యాగం చేయడానికి, ఖుర్బానీ ఇవ్వడానికి నేలపై పడుకోబెట్టారు. ఆ సమయంలో, అల్లాహ్ వద్ద నుండి వచ్చిన దూత, "మీ త్యాగం ఆమోదించబడింది, ఇప్పుడు మీ కొడుకుకు బదులుగా ఒక పొట్టేలును వధించండి" అని అన్నారు. ఆయన అలాగే చేశారు. దివ్యఖుర్ఆన్‌లోని అస్సాఫ్ఫాత్ సూరా 107వ వాక్యంలో ఈ ప్రస్తావన ఉంది. "మేము ఒక గొప్ప ఖుర్బానీ ద్వారా ఇస్మాయీలును రక్షించాము" అని అల్లాహ్ చెప్పాడు.

ఈ దివ్యఖుర్ఆన్ వాక్యంలో గొప్ప త్యాగం అనే పదం ఇస్మాయిల్ (అస)ను ఉద్దేశించి ఉపయోగించడం జరిగింది. అంతేకాని అక్కడ ఖుర్బానీ అయిన పొట్టేలును ఉద్దేశించి కాదు. ఇస్మాయిల్ (అస) గొప్ప త్యాగం కోసం ఎంపిక చేయబడ్డారు. ఆ గొప్ప త్యాగం ఏమిటంటే, ఆ తర్వాత ఇస్మాయిల్ (అస)ను, ఆయన తల్లి గారు హజ్రత్ హాజిరాతో ఒక నిర్జన ఎడారిలో వదిలేయబడ్డారు. ఆ విధంగా వారి ద్వారా కొత్త తరం ఉనికిలోకి వచ్చేలా చేయడం జరిగింది. ఆ సమయంలో, ఈ ప్రాంతం కేవలం నిర్మానుష్య ఎడారిగా ఉండేది. ఒక్క ప్రాణి కూడా లేని ప్రాంతం. అందుకే దివ్యఖుర్ఆన్ దీన్ని అత్యున్నత ఖుర్బానీగా పేర్కొన్నది. ఈ గొప్ప ఖుర్బానీ నిజానికి దైవప్రణాళిక. హజ్రత్ ఇబ్రాహీం (అస) కుమారుడు ఇస్మాయిల్ (అస) ద్వారా దైవం ఈ ప్రణాళికను అరేబియా ఎడారిలో అమలు చేశాడు. ఈ సంఘటన గురించి దివ్యఖుర్ఆన్‌లోని సూరా ఇబ్రాహీం, వాక్యం 37లో క్లుప్తంగా ప్రస్తావించబడింది. "ఇబ్రాహీమ్ ఇలా ప్రార్థించిన సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో : "ప్రభూ! ఈ నగరాన్ని (అంటే మక్కాను) శాంతినగరంగా చెయ్యి. నన్నూ, నా సంతానాన్నీ విగ్రహ పూజనుండి కాపాడు. ప్రభూ ఈ విగ్రహాలు చాలామందిని మార్గం తప్పించాయి. (నా సంతానాన్ని కూడా ఇవి మార్గం తప్పించే అవకాశం ఉంది కనుక వారిలో) నా విధానంపై నడిచేవాడు నా వాడు, నాకు వ్యతిరేకంగా ఉన్న విధానాన్ని ఎవడైనా అవలంబిస్తే నిశ్చయంగా నీవు క్షమించేవాడవు, కరుణామయుడవు. ప్రభూ! తృణకాష్ఠ జలరహితమైన లోయలో నా సంతానంలో కొందరిని తెచ్చి నీ పవిత్ర గృహం వద్ద నివసింపజేశాను. ప్రభూ! వారు ఇక్కడ నమాజును స్థాపించాలని నేను ఇలా చేశాను. కనుక నీవు ప్రజల హృదయాలను ఆసక్తితో వారి వైపునకు మొగ్గేలా చెయ్యి, తినటానికి వారికి పండ్లు ప్రసాదించు, బహుశా వారు కృతజ్ఞులౌతారేమో." (ఇబ్రాహీం: 35-37)

ఆ విధంగా ఒక నిర్మానుష్య ఎడారి ప్రాంతంలో వదిలివేయబడిన హజ్రత్ హాజిరా, ఆమె కుమారుడు హజ్రత్ ఇస్మాయిల్ (అస) ద్వారా ఒక కొత్త జాతి ఉనికిలోకి వచ్చింది. చివరి ప్రవక్త ముహమ్మద్ (స) ఆ జాతిలోనే జన్మించారు. హజ్రత్ ఇబ్రాహీం (అస) తన భార్యాబిడ్డలను ఆ నిర్మానుష్య ప్రాంతంలో విడిచిపెట్టడానికి కారణం అది ఒక దైవప్రణాళిక కాబట్టి. దైవాదేశాలను పాటించడానికి ఆయన ప్రతి పరీక్షను ఎదుర్కొన్నారు.

ఆయన తన కాలంలో ప్రజలకు ఏకదైవారాధన పిలుపునిచ్చారు. కానీ బహుదైవారాధన (షిర్క్), విగ్రహారాధన ఎంతగా ప్రబలిపోయాయంటే ప్రజలు హజ్రత్ ఇబ్రాహీం (అస) ఏకదైవారాధన సందేశాన్ని స్వీకరించలేదు. బహుదైవారాధన ఒక నాగరికతగా మారిపోయింది. ప్రజలు ఆ పరిధిని దాటి ఆలోచించలేని విధంగా మారిపోయారు. పుట్టిన ప్రతి శిశువు పుట్టుకతోనే బహుదైవారాధన పాఠాలు నేర్చుకోవడం జరిగేది. చివరకు అలాంటి వాతావరణంలో పెరిగి అదే మానసిక స్థితి కలిగి ఉండేవారు.

ఆ సమయంలో, అల్లాహ్ ఆదేశంతో, హజ్రత్ ఇబ్రాహీం (అస) ఒక కొత్త ప్రణాళికను రచించారు. ఈ నాగరికత వాసనలు లేని ప్రాంతంలో, నగరాలకు వెలుపల జనావాసాలు లేని ఎడారిలో ఒక కొత్త తరాన్ని సృష్టించాలనేది ఆ ప్రణాళిక. ఈ ఉద్దేశ్యంతోనే హజ్రత్ ఇబ్రాహీం (అస) మక్కాలో హజ్రత్ హాజిరా (అస), హజ్రత్ ఇస్మాయీల్ (అస)లను నివసించేలా చేశారు.

హజ్రత్ ఇబ్రాహీం (అస) ద్వారా ఒక గొప్ప ఏకదైవారాధన సందేశ ప్రచార ప్రణాళిక అమలులోకి వచ్చింది. హజ్ యాత్ర రూపంలో చేసే ఆరాధన నిజానికి దానికి ఒక రిహార్సల్ వంటిది. జిల్ హజ్జా నెలలో నిర్దిష్ట తేదీలలో, హజ్రత్ ఇబ్రాహీం (అస), ఆయన వంశీయులు చరిత్రలో ఏం చేశారో అదే క్రమాన్ని ప్రతీకాత్మకంగా ప్రపంచంలోని ముస్లిములందరూ ఆచరిస్తారు.

హజ్ యాత్రలోను, ఈదుల్ అజ్హా సందర్భంగాను ఖుర్బానీ ఇవ్వడం జరుగుతుంది. ఖుర్బానీలో రెండు కోణాలు ఉన్నాయి. ఒకటి ఖుర్బానీ వెనుక ఉన్న అసలు స్ఫూర్తి. అదేమిటంటే దైవమార్గంలో ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉండడం. రెండవది ఆచరణ పద్ధతి. త్యాగానికి సంసిద్ధం అని ప్రకటించ డానికి సంకేతాత్మకంగా జంతువును బలివ్వడం ఆ ఆచరణ.

చాలా మంది జంతుబలిని వ్యతిరేకిస్తారు, కాని ప్రపంచంలో పోషకాహార కొరతకు నివారణ మాంసాహారమే. ప్రపంచ ప్రజల్లోను, దేశప్రజల్లోను అత్యధిక శాతం మాంసాహారులే. చాలా మందికి నాణ్యమైన మాంసాహారం కొనుక్కునే స్థోమత ఉండదు. బక్రీద్ సందర్భంగా ఖుర్బానీ మాంసం పేదలకు పంపిణీ చేయడం జరుగుతుంది. ఆ విధంగా చాలా మందికి పోషకాహారం లభిస్తుంది. ఖుర్బానీ చేసిన పశువు మాంసాన్ని మూడు భాగాలు చేసి, ఒక భాగాన్ని బంధువులు, మిత్రులకు, ఒక భాగాన్ని పేదవారికి పంచేయడం జరుగుతుంది. ఒక భాగాన్ని మాత్రమే స్వంతానికి వాడుకుంటారు. ఈ ఇచ్చిపుచ్చుకోవడాల వల్ల సమాజంలో చక్కని స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుంది. బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ పశువుల కొనుగోళ్ళ వల్ల ఆర్థిక వ్యవస్థకు కూడా కొత్త ఊపు లభిస్తుంది. మార్కెటులో నగదు చెలామణిలోకి వస్తుంది. పశువులకు పెరిగిన డిమాండ్ స్థానిక ఆర్థికవ్యవస్థకు జీవం పోస్తుంది. రైతులకు, వ్యాపారులకు ప్రయోజనం చేకూరుస్తుంది. ఇవన్నీ ఖుర్బానీ వల్ల సమాజానికి లభించే అదనపు ప్రయోజనాలు మాత్రమే. అసలు లక్ష్యం ఏకదైవారాధన విశ్వాసాన్ని గుండెల్లో నింపుకోవడం. చిత్తశుద్ధితో దైవప్రసన్నత కోసం దేవుని ఆదేశాలకు కట్టుబడతామన్న ప్రతిజ్ఞ చేయడం. ఆ ప్రతిజ్ఞకు ఆచరణాత్మక రూపం ఖుర్బానీ. ✤



# ఈదుల్ అజ్హా సందేశం


**డాక్టర్ ముహమ్మద్ ఖాలిద్ ముబష్షిర్ జఫర్**

అమీరె హల్ఖా, జమాఅతె ఇస్లామీ హింద్, తెలంగాణ


ఇస్లామ్ ధర్మంలోని రెండు ముఖ్యమైన పండుగలలో ఈదుల్ అజ్హా ఒకటి. దీనిని ఇబ్రాహీమ్ (అ) సంప్రదాయానికి అనుగుణంగా జరుపుకుంటాము. ఇది ఎంతో అర్థవంతమయిన, చిరస్మరణీయమైన రోజు. ఈ సందర్భంగా ముస్లిములు హజ్ యాత్ర చేస్తారు. ఈ సందర్భంగా ఇస్లామీయ సోదర భావాన్ని, ఐక్యతను ప్రదర్శిస్తారు.

- ★ పండుగ రోజు అందరూ కలిసి అల్లాహ్ ఔన్నత్యాన్ని చాటండి.
- ★ పండుగ నమాజ్, ఖుర్బానీ ద్వారా అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించండి.
- ★ బంధుమిత్రులు, ముస్లిములు, పొరుగు వారైన ముస్లి మేతరులను పండుగ విందులకు ఆహ్వానించడం మరచిపోకండి.
- ★ కులమతాలకతీతంగా మన చుట్టుపక్కల ఉన్న నిరుపేదలకు (మాంసాహారులకు) మాంసం పంపిణీ చేయండి. వారిని విందులలో పిలవడం మరవ కండి.
- ★ తొలి ఖిబ్లా పరిరక్షణ, మస్జిదె అఖ్సా సాధన, గజాలో బాధిత ఫలస్తీనీయులకు సహాయం, ఇస్లామీ యోధుల విజయాల కోసం అల్లాహ్‌ను ప్రార్థించండి.

నా తరఫున మీ అందరికీ
ఈదుల్ అజ్హా శుభాకాంక్షలు.

# ఇబ్రాహీం (అ) జీవితం స్ఫూర్తిదాయకం

- ముహమ్మద్ రఫీఖ్, అమీరె హల్కా, ఆంధ్రప్రదేశ్



**ప్రపంచ ప్రజల్లో** అత్యధికంగా విశ్వసించేటటువంటి ఏకైక వ్యక్తి హజ్రత్ ఇబ్రాహీం (అలై). ఆయన్ను గ్రంథ ప్రజలైన క్రైస్తవులు, యూదులు, ముస్లిములు తమ నాయకుడిగా విశ్వసిస్తారు. ముఖ్యంగా హజ్రత్ ఇబ్రాహీం(అలై) తనకు తానే ఒక ఉమ్మత్. అల్లాహ్ కూడా ఖుర్‌ఆన్‌లో ఇదే విషయాన్ని చెప్పాడు. హజ్రత్ ఇబ్రాహీం ఒక అకాడమీ. ఒక వ్యవస్థ. ఆయన తనకు తానే ఒక సైన్యం. ఒక మహోన్నత మార్గదర్శకనేత. దైవాదేశాల పాలన విషయంలో ఆయన ఏకోన్ముఖుడు. ఏకాగ్రచిత్తుడు. అసాధారణ త్యాగాలకు చిరునామ హజ్రత్ ఇబ్రాహీం (అలై). ఆయన జీవితం గురించి అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించాడు. ఆయన త్యాగాలకు అల్లాహ్ ప్రసన్నుడయి ఆయన్ను తన స్నేహితుడిగా ప్రస్తావించాడు. ఇబ్రాహీం ఖలీలుల్లాహ్ అన్నాడు. దైవ సందేశాన్ని మక్కా ఖురైషులకు, గ్రంథప్రజలైన యూదులు, క్రైస్తవులకు అందజేసే సమయంలో కూడా దివ్యఖుర్‌ఆన్ హజ్రత్ ఇబ్రాహీం (అలై) ప్రస్తావన తీసుకువస్తుంది. దానికి కారణం ఏమిటంటే గ్రంథప్రజలారా, మక్కా ఖురైషులారా మీరు ఎవరినైతే మీ నాయకుడిగా అంగీకరించి, అనుసరిస్తున్నారో, ఆ నాయకుడు ఏకాగ్రచిత్తంతో ఏకేశ్వరోపాసన చేసిన వ్యక్తే తప్ప మీలా దేవునికి కుమారుడిని కల్పించడంగానీ, దేవునికి భాగస్వామ్యం కల్పించడం గానీ, ఆయన అస్తిత్వంలో ఇతరుల్ని చేర్చడంగానీ చేసిన వ్యక్తి కాదు అని స్పష్టం చేశాడు. హజ్రత్ ఇబ్రాహీం (అలై) నిజమైన వారసులు, అనుచరులు ఎవరైనా ఉన్నారంటే, ముహమ్మద్ (స), ఆయన్ను అనుసరించే ప్రజలే అని చెప్పి ఖుర్‌ఆన్‌లో స్పష్టం చేశాడు.

ఒక విశ్వాసికి ధర్మం పై ఉండవలసిన నమ్మకాన్ని గురించి తెలియజేస్తూ ఖుర్‌ఆన్ లోని ఆరవ అధ్యాయంలోని 161–163 వాక్యాలలో ఏమంటాడంటే ఒక విశ్వాసికి అల్లాహ్ ప్రసాదించిన ధర్మంపై నమ్మకం, దానిపట్ల ఏవిధమైనటువంటి ఊగిసలాట లేకుండా స్థిరత్వం ఉండాలని చెబుతూనే ఆ ధర్మం హజ్రత్ ఇబ్రాహీం అలై అనుసరించిన ధర్మం, ఆయన ఎంతో ఏకాగ్రచిత్తంతో ఆ ధర్మాన్ని అనుసరించాడు అని చెప్పి హజ్రత్ ఇబ్రాహీం (అలై) వారి రిఫరెన్సును అల్లాహ్ ఇచ్చాడు. ఖుర్బానీ ఇచ్చేవారు యాదృచ్ఛికంగా, యాంత్రికంగా, లాంఛనప్రాయంగా ఇవ్వకుండా ఖుర్బానీని పూర్తి స్పృహతో ఇవ్వాలి. హజ్రత్ ఇబ్రాహీం (అలై) ద్వారా పొందిన స్ఫూర్తిని మనం పూర్తిగా అవగాహన చేసుకుని మనం ఖుర్బానీ ఇవ్వాలి. ఇదే హజ్రత్ ఇబ్రాహీం (అలై) గారి జీవితం మనకిచ్చే సాక్ష్యం.

ఇక రెండవ విషయం ఏమిటంటే... ఈ రోజు ఏవైతే సమస్యలు మనం చూస్తున్నామో అవే సమస్యలు ఇంచుమించు హజ్రత్ ఇబ్రాహీం (అలై) కాలంలోనూ ఉన్నాయి. అక్కడ కూడా దేవుడిని విభజించి, దైవానికి సహవర్తులుగా నియమించే షిర్కు విపరీతంగా ఉండేది. ప్రజల మధ్య అసమానతా భావాలు కూడా ఉండేవి. ఆమీలు, మిస్కీనులుగా, అర్ధులుగా విభజించబడేవారు. పూజాధికారులు, సైనికాధికారులది ఒక గ్రూపు అయితే వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, వ్యవసాయదారులది మరోగ్రూపు. బానిసలది ఒక గ్రూపు ఉండేది. ఆమీలు అనేటటువంటి వారే వ్యవస్థను నడిపేవారు. అదే పరిస్థితులు ఇక్కడ కూడా ఉన్నాయి. ధార్మికత, ఆధ్యాత్మికత ముసుగులోనే ఉద్యోగాలు, పరిశ్రమలు, వ్యాపారాలు, ప్రజాసంబంధాలు, కొనసాగడమే కాకుండా ముఖ్యంగా పాలనా వ్యవస్థ కూడా మతం ముసుగులోనే నడుస్తోంది. ఎవరైతే బాబాలు, పండితులు, మత గురువులుగా చెలామణి అవుతున్నారో వాళ్లు రాజకీయాలను శాసించడం పాలనా వ్యవస్థలో జోక్యం చేసుకోవడం మనం చూస్తున్నం. ఈ విధంగా ఆధ్యాత్మికత పేరుతో ప్రజల మధ్య విభజనలు, మతం పేరుతో ప్రజల అసమానతలు, మతం ముసుగులో అవినీతి, అక్రమాలు, ఇవన్నీ అప్పుడూ ఉండేవి. ఆకాలంలో హజ్రత్ ఇబ్రాహీం (అలై) వాటిని ప్రశ్నించారు.

హజ్రత్ ఇబ్రాహీం (అలై) గారి జీవితంలోని ముఖ్య విషయాలు మనం తీసుకున్నప్పుడు దైవం పట్ల అచంచల మైన విశ్వాసం, నమ్మకం కనిపిస్తాయి. హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం ద్వారా మనం తప్పనిసరిగా స్ఫూర్తిని పొందాలి. అలాగే ఎలాంటి సంక్లిష్టమైన పరిస్థితులు ఎదురైనప్పటికీ, ఎలాంటి కష్టాలు, నష్టాలు విరుచుకుపడినా, అననుకూల పరిస్థితులు వచ్చినాసరే

ఆశావహదృక్పథం ఏదైతే ఉందో, పాజిటివ్ థింకింగ్ ఏదైతే ఉందో అది హ|జ్రత్ ఇ|బ్రాహీం అలై జీవితం నుంచి నేర్చుకోవాలి. అదేవిధంగా సహనానికి సజీవ నిదర్శనం హ|జ్రత్ ఇ|బ్రాహీం (అలై). దైవమార్గంలో అల్లాహ్ పెట్టిన పరీక్షల్ని ఎదుర్కొనే విషయంలో ఆయన కనబర్చిన అచంచలమైన సహనాన్ని మనం అలవర్చుకోవాలి. దైవధర్మంపై ఆయన కనబర్చిన స్థిరత్వం ఆదర్శనీయం. ఎలాంటి విపత్తులు విరుచుకు పడినప్పటికీ ప్రాణాంతకమైన సమస్యలు వచ్చిపడినప్పటికీ ఆయన ఒక పర్వతం ఏవిధంగానైతే తుఫానులు, సునామీలు వచ్చినా తన స్థానంలో చెక్కుచెదరకుండా నిలబడుతుందో అదే విధంగా హ|జ్రత్ ఇ|బ్రాహీం అలై విశ్వాసంపై నిలబడిన తీరు మనందరికీ స్ఫూర్తిదాయకం. భార్యాపిల్లలకు శిక్షణనిచ్చే జా|గ్రత్తలు, వివేకవంతమైన నిర్ణయాలు, సమకాలీన వ్యవస్థలోని చెడుగులను వేలెత్తిచూపి గళాన్ని వినిపించడం, నియంత పాలకుడిని వ్యతిరేకించడం, దౌర్జన్యపరుడైన రాజ్యాధినేతముందు నిలబడి దేవుని ఏకత్వపు సత్యసందేశాన్ని అందజేసేవిషయంలో ఆయన చూపిన ధైర్యం, తెగువ, సాహసం ఇవన్నీ హ|జ్రత్ ఇ|బ్రాహీం అలై విశ్వసించామని చెప్పేవారందరూ అనుసరించ వలసిన విషయాలు.

హజ్ యా|త్ర చేసే విషయంలో కానీ, ఖుర్బానీ ఇచ్చేటటువంటి విషయంలోకానివ్వండి, హ|జ్రత్ ఇ|బ్రాహీం (అలై) గారి పూర్తి జీవితాన్ని అవగాహన చేసుకుని, ఆ స్ఫూర్తిని, అందులోని సందేశాన్ని చైతన్యంతో పూర్తి జాగృతితో మనం పనిచేయాల్సిన అవసరం ఉంది. నేడు హ|జ్రత్ ఇ|బ్రాహీం అలై గారి త్యాగం, సహనం లాంటి సుగుణాలన్నింటినీ సమకాలీన పరిస్థితుల్లో మన జీవితాల్లో అప్లయ్ చేసుకుని మనం ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. అదే విధంగా ఖుర్బానీ ఇచ్చేటటువంటి సమయంలో పరిశు|భత, పరిశుద్ధత విషయంలో జా|గ్రత్తలు తీసుకోవడమే కాకుండా ఎక్కడా ఎవరికీ ఇబ్బంది కలగకుండా మన |ప్రవర్తనాసరళి ఉండాలి. అందరికీ ఈదుల్ అజ్హా శుభాకాంక్షలు.


బిస్మిల్లా హిర్రహమాన్ నిర్రహీమ్

# మన్నా సల్వా పికిల్ హోమ్

క్వాలిటీ మా ప్రత్యేకత

Cell : 77022 27869, 95155 28853, 93928 99888, 93463 33853

**స్పెషల్ నాన్‌వెజ్ పచ్చళ్ళు** కోడి ఊరగాయ, బోన్‌లెస్ కోడి ఊరగాయ, నాటుకోడి, రొయ్య, మటన్, మటన్ ఖీమా, కొరమేను, పీత ఆవకాయలు లభించును.


**స్పెషల్ వెజ్ పచ్చళ్ళు** కొత్తపల్లి కొబ్బరి మామిడి ఆవకాయ, మాగాయ, అల్లం, పండుమిర్చి, ఉసిరి, గోంగూర, కొత్తిమీర, కరివేపాకు, నిమ్మకాయ, టమాటా, కాకరకాయ, వెల్లుల్లి, కాలిఫ్లవర్, మునగకాడ మొదలగు నాణ్యమైన పచ్చళ్ళు లభించును.

**స్పెషల్ కారప్పొడులు** ఇడ్లీ కారప్పొడి, కరివేపాకు కారప్పొడి, నల్లకారం, నువ్వుల పొడి, కాకరకాయ కారప్పొడి, మునగాకు కారప్పొడి, కంది కారప్పొడి, రొయ్య కారప్పొడి లభించును.

**స్పెషల్ వడియాలు** పిండి వడియాలు, గుమ్మడి వడియాలు, పెసర వడియాలు, ఆవిరి వడియాలు, మజ్జిగ మిరపకాయలు మొదలగునవి లభించును.




ఆంధ్రా పచ్చళ్ళ రుచులను ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన సంస్థ "మన్నా సల్వా పికిల్ హోమ్"




H.O. : వీరభద్రపురం, తణుకు మండలం, ప॥గో॥జిల్లా.

B.O. : 1. తేతలి : వై-జంక్షన్, NH-16 రోడ్, శ్రీరామా హోటల్ ప్రక్కన, తణుకు.

2. తణుకు : స్త్రీ సమాజం రోడ్, రాజీవ్‌చౌక్ సెంటర్, ప॥గో॥జిల్లా.

3. రావులపాలెం : మల్లయ్య దొడ్డి, రావులపాడు, వినాయకుని గుడి ప్రక్కన, తూ॥గో॥జిల్లా.

4. మండపేట : గాంధీ నగర్, చిన్న మసీదు ఎదురుగా, తూ॥గో॥జిల్లా.

Checkus on : Google Justdial

http : www.mannasalvanonvegpicklehome.com E-mail : mannasalva9888@gmail.com

సాంప్రదాయకమైన రుచి, నమ్మకమైన క్వాలిటీ, ఖాతాదారుల అభిరుచి, విలువలతో కూడిన వ్యాపారం మా "మన్నా సల్వా పికిల్ హోమ్" లక్ష్యం...

అధ్యాయం -12

34

# త్రీడా ధన శ్రేష్ఠుడు

ఎస్.ఎమ్. మలిక్

### శాంతి స్థాపన, సంస్కరణల పథకం

మహనీయ ఉస్మాన్ (ర) ఓ పథకం ప్రకారం తన పరిపాలనలో శాంతి స్థాపనకు, ప్రజల సంస్కరణకు ప్రయత్నాలు చేశారు. ఆ పథకానికి చిత్తశుద్ధి కార్యశుద్ధి గల కొందరు అధికారులు ప్రాణాలొడ్డి ఆచరణ రూపం ఇచ్చారు. నిజానికి వారే ఈ చారిత్రక కార్యాచరణకు ప్రధాన పాత్రధారులు. ముక్తసరిగా వారి వివరాలు :

అస్వద్ బిన్ కుల్సూమ్‌ని నీషాపూర్ ప్రాంతంలో విద్రోహ చర్యల్ని రూపుమాపడానికి పంపడం జరిగింది. శత్రువులు నగర ప్రహరీ గోడలో తలదాచుకున్నారు. ఆ గోడ, బాగా బలమయిన రాళ్ళతో వెడల్పుగా నిర్మించబడింది. అస్వద్ రాత్రి వేళ కొందరు మిత్రులతో కలసి ప్రహరీ గోడలో మనిషి దూరేంత పెద్ద రంధ్రం చేశారు. తొలుత స్వయంగా అస్వద్ లోనికి ప్రవేశించారు. ఆయన వెనకాల ఇతరులూ ప్రవేశించగా పెద్ద ఎత్తున ప్రతిఘటన జరిగింది.

అస్వద్ అందులో అమరగతి పొందారు. ఆయన సోదరుడు అద్‌హమ్ బిన్ కుల్సూమ్ బావుటాను చేబూనారు. వీరోచితంగా పోరాడి ఆ నగరాన్ని వశపరచుకున్నారు. పిదప ఆయన మిగతా ప్రాంతాన్నీ కైవసం చేసుకున్నారు. కడకు నీషాపూర్ జనులు క్షమాపణలు చెప్పుకుని జిజ్యా చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ పైన కైస్ బిన్ హైసమ్‌ని అక్కడ పాలనాధికారిగా నియమించడం జరిగింది.

కైస్ అక్కడి వ్యవహారాలను చక్కబెట్టిన తరువాత అబ్దుల్లా బిన్ ఆమిర్ ఆదేశానుసారం ఆ ప్రాంతంలో ఇంకా ఖలీఫా విధేయత క్రింద రాని ప్రదేశాలను సాయుధ చర్యల ద్వారా కప్పం కట్టేలా సంస్కరించి తీర్చిదిద్దారు. వారిలో ఓ జిల్లా అధికారి, నగర ప్రజల్లో ఓ వంద మందిని వదలి వేసినట్లయితే నగరాన్ని అప్పజెప్పగలమని అభ్యర్థించగా దాన్ని అంగీకరించి ఆ వంద మందిని తప్ప అందరినీ పట్టి ఖైదు చేయడం జరిగింది. కొన్నాళ్ళ తరువాత వారితో జిజ్యా చెల్లించి విధేయులయేందుకు ఒప్పందం కుదిరింది.

అబ్దుల్లా బిన్ హాజిమ్ ఖలీఫా ఆదేశం ప్రకారం అఫ్గానిస్తాన్ లోని హరాత్ ప్రాంతంలో అలజడిని అణచడానికి వెళ్లారు. ప్రారంభంలో ఎదిరించినా తరువాత లొంగి జిజ్యా చెల్లించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు అక్కడి ప్రజలు. అక్కడి నుంచి ఆయన మర్వ్ (తుర్కమనిస్తాన్)కు వెళ్ళినప్పుడు

అక్కడి నాయకుడు జిజ్యా చెల్లించి ఉస్మానీ(ఖిలాఫత్)కు విధేయుడయి ఉండేందుకు ఒప్పుకున్నాడు.

అహ్నాఫ్ బిన్ కైస్‌ని తుఖారిస్తాన్ (నేడు అది ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్, అఫ్ఘనిస్తాన్, మూడు ప్రాంతాల్లో విభక్తమయి ఉంది)కు పంపడం జరిగింది. అక్కడ ఆయనకు గట్టి పోటీ ఇచ్చారు అక్కడి పాలకులు. వారు ఈరానీ తుర్కీ తెగల్ని కూడా తమతో కలుపుకుని గొరిల్లా తీరులో ఎదిరించారు. అయినా కాస్సేపటికే వెను తిరిగి పారిపోసాగారు. కడకు తుఖారిస్తాన్ రాజధాని బల్ఖ్ నాయకులు ఇక పోరాడటం అనుచితమని భావించి కప్పం కట్టి విధేయతకు అంగీకరించారు.

రబీ' బిన్ హారిసాను ఈరాన్‌లోని సీస్తాన్ లేదా సజిస్తాన్‌లో అలజడిని అణచడానికి పంపారు. ఆయన అనేక నగరాల్లో పోటీ ఎదుర్కొన్నా ఆ ప్రాంతం అంతా వశమయి పోయింది. ఖలీఫా ఆదేశం మేరకు రబీ' బిన్ హారిసా ఆ ప్రాంతంలో గవర్నర్‌గా కొంత కాలం బాధ్యతలు నిర్వహించారు. ఆయన ప్రత్యేకత ఏమిటంటే ఆ కాలపు మహా ఇస్లామీయ పండితులు హసన్ బస్రీ(రహ్మ) ఆయనకు ప్రైవేటు సెక్రటరీగా వ్యవహరించారు!

రబీ'బిన్ హారిసా తన వ్యవధి ముగిసిన తరువాత తిరిగి వెళ్ళగానే అక్కడి ప్రజలు తిరిగి తిరుగుబాటు మొదలెట్టారు, అందువల్ల అబ్దుర్రహ్మాన్ బిన్ సమురను అక్కడికి పంపడం జరిగింది. సీస్తాన్ ప్రజలు తమ తప్పిదాన్ని ఒప్పుకుని ఒప్పందం పునరుద్ధరించుకున్నారు. ఆ తరువాత అబ్దుర్రహ్మాన్ పలుచోట్ల జనాన్ని ఒప్పించి, కొన్ని చోట్ల సైనిక చర్య ద్వారా లోబరచుకుంటూ ముందుకుసాగారు. క్రమంగా విజయాలు చవిచూస్తూ హిందూకుష్ (హిమాలయాల పడమటి అంచున ఆనాటి హిందూస్తాన్ సరిహద్దు) వరకు ఇస్లామీయ పతాకాన్ని ఎగురవేశారు. అటు నుంచి ఆయన కంధార్, కాబుల్‌ను సయితం వశపరచుకున్నారు. పిదప అక్కడ అబ్దుర్రహ్మాన్ నే దూరప్రాచ్య ప్రాంతాల పర్యవేక్షణ కొరకు నియమించడం జరిగింది.

ముజాషి' బిన్ మస్‌ఊద్‌ని ఈరాన్‌లోని కర్మాన్ ప్రాంతంలో తిరుగుబాటు దారుల అణచివేతకు నియమించడం జరిగింది. ఈయన బయలుదేరిన తరువాత దారిలో కొన్ని చోట్ల తిరుగుబాటు దారులు ప్రతిఘటించారు. ప్రతి చోటా ప్రతి ప్రతిఘటనకూ ఆయన గట్టిగా సమాధానం చెప్పారు. కడకు కర్మాన్ ప్రాంతంలో శాంతి స్థాపన సవ్యంగా సునిశ్చితమయింది. అలా తూర్పు ప్రదేశాల్లో చాలా మటుకు తిరుగుబాటుల అణచివేత, కొత్త ప్రదేశాలు ఇస్లామీయ పాలనలోకి చేరడం పూర్తయింది.

మూడవ ఖలీఫా మహనీయ ఉస్మాన్(ర) తన ఖిలాఫత్ నాల్గవ సంవత్సరం, అంటే హిజ్రీ 27వ సంవత్సరం, అబ్దుల్లా బిన్ ఆమిర్‌కు ఈరాన్‌లో సంస్కరణ, పటిష్టత, సుస్థిరతలకుగాను నియమించారు. ఈ విధి నిర్వహణ కొరకు ఆయన ఎన్నుకున్న వ్యక్తి ఎంతగా యోగ్యమయిన వారో ఆయన సాధించిన కార్యకలాపాల ద్వారానే ద్యోతకమవుతుంది.

హిజ్రీ 32వ సంవత్సరం వరకు అంటే ఆరు సంవత్సరాలలో ఆయన వేల మైళ్ళ వరకు వ్యాపించిన కొండ తెగల యోధుల్ని అదుపులోకి తెచ్చి ఖిలాఫత్ అండదండల్లో విధేయులయి మనగలిగేలా సమ్మతింపజేశారు. చైనా వలస పాలనలోని ప్రదేశాల వ్యవహారాలు సయితం ముస్లిముల రాజకీయ వ్యవస్థలో చేరిపోయాయి. ఈ విధంగా ఈరాన్ నుండి దాదాపు తొమ్మిది లక్షల చదరపు మైళ్ళ ప్రాంతం శాంతిపూర్వక ప్రపంచంలోకి పరివర్తన చెందింది. చాలా మంది సత్య ప్రియులు, మనస్ఫూర్తిగా ఇస్లామ్ స్వీకరించి దైవానికి కృతజ్ఞతలు అర్పించుకున్నారు.

అబ్దుల్లా బిన్ ఆమిర్‌కు జనులు, ఆయన సేవలకు గుర్తుగా, "దైవం మీ ద్వారా చాలా మంది బుద్ధికి అందని పని చేయించాడు" అని పొగడగా ఆయన కళ్ళు చెమర్చాయి. ఆయన తన స్థానంలో కైస్ బిన్ హైసమ్‌ని నియమించి ఇహ్రామ్ ధరించి నీషాపూర్ నుంచి మదీనా, తరువాత మక్కా వరకు కాలినడకనే వచ్చారు. తొలుత అమీరుల్ మూ'మినీన్‌ని కలసుకున్న తరువాత మక్కా వెళ్ళి దైవ గృహ దర్శనం, ప్రదక్షిణలు ముగించుకున్నారు. ఆ సందర్భం అంతా ఆయన కన్నీరు కారుస్తూనే ఉన్నారు. కాబా వద్ద సజ్దాలో పడి వెక్కివెక్కి రోదిస్తూ వేడుకున్నారు ఆయన, "తప్పిదాలను, కొరతల్ని కప్పిపుచ్చే ప్రభూ! నా తప్పుల్ని మన్నించి వెయ్యి, దైవం తప్ప మరెవరున్నారు మన్నించేవారు!!"

ముస్లిములూ ఈరానీయులు, అలాగే ముస్లిములూ రోమనులు, ఈ ఉభయ వర్గాల మధ్య పోరులో బలగాల నిష్పత్తి

ఒకటికి ఎనిమిది అని అనేక చారిత్రక ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. ఇదే వాస్తవం!

ఒక యాపిల్ పండు చెట్టు నుండి క్రింద పడటాన్ని బట్టి భూమ్యాకర్షణ శక్తిని ఒప్పుకుంది ప్రపంచం. మన భూమి నిలకడగా ఉందని ఆకాశమే తిరుగుతోంది అన్నా అంగీకరించిందీ లోకం. ఆ పైన అది తప్పు, వాస్తవానికి ఈ భూమి స్వయంగా తన చుట్టూ తాను తుపాకీ గుండు కన్నా వేగంగా తిరుగుతోంది అన్నా సరేనని విధేయతతో తలూపింది ప్రపంచం.

కాని ఆశ్చర్యం ఏమిటంటే ప్రపంచం ఈ యథార్థాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేదు, నిస్సహాయులు, నిరాయుధులూ ఎటువంటి సాధనా సంపత్తి లేని వారు అతి కొద్ది మంది మాత్రమే, నిఖిల జగతిలోనే శక్తి మాన్యులు తమ మీదికి మోహరించి వచ్చినప్పుడు, కేవలం సత్యం తలవంపులకు గురికారాదని దైవం పైన భారం మోపి రంగంలో ప్రవేశించారు. ఒక్క అధర్మం, ఒక్క అక్రమం జరక్కుండా ప్రపంచం మొత్తాన్ని సంస్కరించేందుకు నడుం బిగించారు, వైరివీరుల నడుములు విరగ్గొట్టారు! ఇస్లామీయ చరిత్ర ఇటువంటి ఉదాహరణలతో నిండి ఉంది, ముఖ్యంగా ప్రవక్తశ్రీ (స), తరువాత ఖలీఫాల చరిత్ర!

★ ★ ★

## మరిన్ని అలజడులు, మరిన్ని విజయాలు

అలెగ్జాండ్రియ (మధ్యధరా సముద్రంలో ఈజిప్టు ఓడరేవు) మహనీయ ఫారూక్ కాలంలోనే ముస్లిముల కైవసమయింది. నాలుగేళ్ల తరువాత రోమను చక్రవర్తి ఇక్కడ రోమను పౌరుల ద్వారా తిరుగుబాటు చేయించాడు. ఇంకా కాన్‌స్టాంటినోపుల్ (Constantinople) నుంచి యుద్ధ నౌక వారి సహాయార్థం పంపించాడు. అయినా మహనీయ అమ్ర్ బిన్ ఆస్(ర) వెళ్లి సుఖం మరిగిన రోమనులను చిత్తు చిత్తుగా ఓడించారు. ఆ తరువాత ఆసియా మైనర్ [1] ప్రాంతంలో పెద్ద సంఖ్యలో రోమను సేన మోహరించిన కారణంగా ఆర్మేనియా నుండి సల్మాన్ బిన్ రబీఅను అక్కడికి పంపించారు మహనీయ ఉస్మాన్(ర).

1. *ఆసియా మైనర్ అని, ఆసియా యూరోపు ఖండాలు కలసుకునే ప్రాంతాన్ని అంటారు. అది నేడు 'తుర్కియా'లో ఉంది. - మలిక్*

సల్మాన్ ఆర్మేనియా నుంచి వస్తూ అనేక ప్రాంతాలను జయప్రదంగా వశపరచుకుంటూ రోమనుల్ని ఎదుర్కొనేందుకు వచ్చారు. వారిని ఎదురొడ్డి ఇచ్చిన ఘాతాలకు వారు తిరిగి లేవలేకపోయారు. అదే కాలంలో ఇతర ముస్లిమ్ సేనానులు సైప్రస్‌కు తూర్పున ఉన్న అనేక ప్రాంతాలను వశపరచుకుని ఖలీఫా ఆదేశం ప్రకారం బుర్సా అనే చోట సైనిక స్థావరం నెలకొల్పారు. మధ్యధరా సముద్ర తీరంలో పలు చోట్ల ముస్లిమ్ ఆవాసాలను స్థాపించారు.

## ఈజిప్టు పరిపాలనా వ్యవస్థ

మహనీయ అమ్ర్ బిన్ ఆస్(ర) ఈజిప్టును ఇస్లామీయ రాజ్య పరిధిలోకి తెచ్చినవారు, ఆయనే మహనీయ ఉమర్(ర) కాలం నుంచి దాని గవర్నర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. మరో భాగాన అబ్దుల్లా బిన్ అబీ సర్హ(ర) పరిపాలించే వారు. మహనీయ అమ్ర్ బిన్ ఆస్ వల్ల ప్రభుత్వ ఆదాయం తగ్గిపోయిందని అబ్దుల్లా ఆరోపించారు. దానికి స్పందించి ఖలీఫా మహనీయ అమ్ర్ బిన్ ఆస్‌ని రాబడిని పెంచమని ఆదేశించారు. దానికి ఆయన అతి స్పష్టంగా, "ఒంటె ఇంతకన్నా అధికంగా పాలివ్వ జాలదు" అన్నారు.

దాని మీదట అమీరుల్ మూ'మినీన్, మహనీయ అమ్ర్‌ని తొలగించి అబ్దుల్లాను ఈజిప్టు ప్రాంతమంతటికీ గవర్నర్‌గా నియమించారు. అప్పుడు ఆదాయం పెరిగింది. మహనీయ ఉస్మాన్(ర) మహనీయ అమ్ర్‌ని ఉద్దేశించి అడిగారు, "ఒంటె ఇప్పుడు అధికంగానే పాలిస్తోంది!" అని. దానికి మహనీయ అమ్ర్, "అవును, పాలయితే అధికంగానే పిండుకున్నారు, కాని వాస్తవానికి దూడలు పస్తులుండి పోయాయి!" అన్నారు.

ఈ విధంగా రోమనులు ఈజిప్టు, సిరియా, సైప్రస్ ప్రాంతాలను కోల్పోయిన తరువాత వాటిని తిరిగి చేజిక్కించుకోగలిగే ఆశలు మిగులనందున సీజరు ఉత్తర ఆఫ్రికా దేశాలతో ఒడంబడిక కొరకు ప్రయత్నాలు మొదలెట్టాడు. అయితే మహనీయ ఉస్మాన్(ర) ఓ పథకం ప్రకారం, అబ్దుల్లా బిన్ అబీ సర్హకు తోడుగా మహామహులయిన సహచర మాన్యులతో కూడిన ఓ సేనను పంపించారు. వారిలో మహనీయులు అబ్దుల్లా ఇబ్ను అబ్బాస్, అబ్దుల్లా ఇబ్ను ఉమర్, అమ్ర్ బిన్ ఆస్, ఇబ్ను జాఫర్, హసన్ బిన్ అలీ, హుసైన్ బిన్ అలీ, ఇబ్ను జుబైర్ ప్రభృతుల వంటి దిగ్గజాలున్నారు.

అబ్దుల్లా ఇబ్ను అబీ సర్హ్, ఆ సేన చేరిన తరువాత బయలు దేరి టునీషియా వరకు నిరాఘాటంగా విజయాలు సాధిస్తూ సాగారు. టునీషియా తూర్పు ప్రాంతంలో దాదాపు లక్షన్నర మంది రోమను సేన మోహరించి ఉంది. అంటే అది తమ సేన కన్నా ఆరు రెట్లు అధికమయిన బలం అన్నమాట! ఆఫ్రికన్ల గవర్నర్, 'గ్రేగరీ' కు ముస్లిములు సంధి ఒడంబడిక చేసుకునేం దుకు పిలుపునిచ్చారు. గర్విష్టి గ్రెగరీ అంగీకరించ లేదు. ఇరుసేనల మధ్య భీకర పోరాటం సాగింది. పోరులో అతను అంతమయి పోయాడు. కడకు అక్కడి కోట ముస్లి ముల కైవసమయి పోయింది. అలా టునీషియాతో సహ ఉత్తర ఆఫ్రికా దేశాల్లో ఇస్లామ్ సుస్థాపితం అయింది.

## నౌకాదళం స్థాపన

సిరియాలో ఖిలాఫత్ పక్షాన గవర్నర్‌గా ఉన్న మహనీయ అబూ సుఫ్యాన్ తనయుడు ముఆవియ, తన అధీనంలోని సిరియాకూ ఆర్మేనియాకూ మధ్యనున్న రోమను రాష్ట్రాల వల్ల సతతం ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఆయన అభిప్రాయంలో, కాన్‌స్టాంటినోపుల్ (Constantinople) ని చేజిక్కించుకోనంత వరకు రోమను సేనల్ని ఆపడం కష్ట సాధ్యమయిన పని. అందుకు సేనలో నౌకాదళం ఏర్పరచడం అవసరం. ఆయన ఈ విషయాన్ని మహనీయ ఉమర్(ర) కాలంలో కేంద్రానికి నివేదించుకున్నారు. అయినా అనేక కారణాల వల్ల దానికి అనుమతి లభించలేదు.

## యుద్ధ నౌక

యుద్ధ నౌకను గురించి మహనీయ ఉమర్(ర) కాలంలో ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్‌ని ఆయన విచారించారు. దానికి మహనీయ అమ్ర్ వ్రాసిన పత్రం క్లుప్తంగా క్రింద అందజేస్తున్నాము:

"నేను ఆ వాహనాన్ని (నౌకను) చూశాను. అదొక పెద్ద ప్రాణి వంటిది, దాని పైన చిన్న చిన్న ప్రాణులు ఎక్కుతారు. అది నిల్చొని ఉన్నా గుండెలు దడ దడా కొట్టుకుంటాయి. అది నడుస్తూ ఉంటే మెదడు మొద్దు బారుతుంది. అందులో మంచి అన్నదీ శుభమన్నదీ బహు తక్కువ. చెడుగే అధికం. దాని పైన కూర్చున్న వారు నీటి పైన తేలే బల్లపై కూర్చు న్నట్లు, కాస్త ఎటువైపు మొగ్గినా మునిగిపోయే ప్రమాదం ఉన్నట్లు కూర్చోవాలి, తప్పించుకుంటేనే బతికి పోతారు!"

ఇది చూసి మహనీయ ఉమర్(ర) దాన్ని ఉదాహరించి, మహనీయ ముఆవియాకు, "దైవం పైన ఒట్టు! నేను ముస్లి ములను ఇటువంటి వాహనం ద్వారా ప్రయాణానికి అనుమతి నివ్వను" అని వ్రాశారు.

మహనీయ ఉస్మాన్(ర) ఖలీఫాగా నియమితులయిన తరువాత మహనీయ ముఆవియా ఆయన వద్దకు వెళ్లి ఈ విషయాన్ని తిరిగి నివేదించుకున్నారు. ఆయన అనుమతినిస్తూ, నౌకాదళంలో చేరదలచి ఆ అభిరుచి, మొగ్గుదల గలవారినే అందులో ప్రవేశం కల్పించవలసిందని ఆంక్ష పెట్టారు. అప్పుడు చాలా మంది సహచర మాన్యులతో కూడిన సేనతో నావికాదళం ఏర్పడింది, అప్పుడే సైప్రస్ దీవి కూడా కైవసం చేసుకోవడం జరిగింది. ❑


## చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు
**Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

# హజ్

# విశ్వాసులందరికీ అది మార్గదర్శక కేంద్రం



**హజ్-** ఈ అరబీ పద బంధానికి సందర్శన సంకల్పము అని అర్థం. జిల్‌హజ్ మాసపు పదవ తేదీన సౌదీ అరేబియాలోని మక్కా నగరంలో హజ్ జరుగుతుంది. దీనికి ప్రపంచం నలుమూలల నుండి అసంఖ్యాక ప్రజలు హాజరవుతారు.

ఇది దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం(అలై) గారి కాలంలో ప్రారంభ మయింది. ఆయన జన్మస్థలం ఇరాక్. ఇరాక్ ఆ కాలంలోనూ అభివృద్ధి చెందిన దేశమే అయినప్పటికీ ధార్మిక విషయాల్లో వారి విజ్ఞానం శూన్యం. నక్షత్రాలను గ్రహాలను పూజించేవాళ్ళు. చేతబడి, జ్యోతిష్యం, శకునాలు ఇంకా ఇలాంటి అనేక మూఢ నమ్మకాలు చెలామణిలో ఉండేవి.

పూజారులకు అమితమైన గౌరవ మర్యాదలు లభించేవి. వారి మాట దైవ వాక్కుగా పరిగణించేవారు. ఇరాక్ రాజకుటుంబం పూజారులను తమ కనుసన్నలలో మెలిగేలా చూసుకొనేది. రాజు కూడా దైవ సమానుడని, ఆయన్ను పూజించాలని ఈ పూజారులు ప్రజలకు నూరిపోసేవారు.

అటువంటి పూజారుల కుటుంబంలోని ఓ ప్రముఖ పూజారి ఇంట్లో జన్మించారు హజ్రత్ ఇబ్రాహీం (అలై). ఆయనకు ఊహ తెలిసిన దగ్గర్నుంచీ తమ సమాజం గురించి ఆలోచించేవారు. ఈ సూర్యచంద్రాదులు, నక్షత్రాలు, గ్రహాలు, తమ కుటుంబం పూజించే ఈ దేవతా విగ్రహాలు, ఇవన్నీ ఎవరో ఒకరు తయారు చేసినవే కదా! ఇవన్నీ ఎప్పుడో ఒకప్పుడు నాశనమై పొయ్యేవే కదా! మరలాంటప్పుడు ఇవి దేవుళ్ళెలా అవుతాయి?

మరివి దేవుళ్ళు కానప్పుడు, ఇవేవీ నన్ను సృష్టించనప్పుడు, వీటివల్ల నాకేమీ లాభ నష్టాలు లేనప్పుడు నేను వీటి నెందుకు పూజించాలి? ఇలా ఆలోచించి ఆలోచించి ఓ స్థిర నిర్ణయానికి వచ్చేసి ఇలా ప్రకటించారు:

“ఎవరినయితే మీరు దైవ సమానులుగా భావిస్తున్నారో వారితో నాకెలాంటి సంబంధమూ లేదు. నేను అన్ని వైపుల నుండి మరలి, భూమ్యాకాశాల సృష్టికర్త వైపునకు ఏకోన్ముఖుడనయ్యాను. నేను ఆయన్ను తప్ప మరొకరిని ఆయనకు సహవర్తునిగా ఎంచేవాణ్ణి కాను.”

ఈ మాటలు విన్న మరుక్షణం ఇతరులయితే సరేసరి స్వయాన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులే వ్యతిరేకమైపోయారు. జాతి వాళ్ళు కత్తులు నూరారు. చివరికి పాలకులు సయితం వెంట బడ్డారు. కాని హజ్రత్ ఇబ్రాహీం (అలై) ఏ మాత్రం తడబడలేదు. భయపడలేదు. రాజు తన దర్బారుకు పిలిపించి విచారించాడు. రాజు గారి దర్బారులో ముఖాముఖి విస్పష్ట సమాధానం చెప్పారాయన.

“ఎట్టి పరిస్థితిలోనూ నువ్వు నా ప్రభువ్వి కావు. ఎవరైతే నిన్నూ, నన్నూ ఇద్దర్నీ పుట్టించాడో ఆయనే నా ప్రభువు. ఎవరయితే సూర్యుణ్ణి తూర్పున ఉదయింపజేసి పశ్చిమాన అస్తమింపజేస్తాడో ఆయనే నా ప్రభువు. నా దైవం”

హజ్రత్ ఇబ్రాహీం గారి ఈ సమాధానానికి రాజు అగ్గిమీద గుగ్గిలమైపొయ్యాడు. వెంటనే ఇతన్ని మలమలమాడే మంటల్లో వేసి కాల్చెయ్యండని ఆజ్ఞాపించాడు. క్షణాల్లో ఆజ్ఞను అక్షరాలా ఆచరణలో పెట్టారు. కాని దైవానుగ్రహంతో హజ్రత్ ఇబ్రాహీం (అలై) సురక్షితంగా బయటపడ్డారు.

తరువాత ఆయన్ని దేశం నుండి బహిష్కరించడం జరిగింది. శ్రీమతిని తీసుకొని సిరియా, పాలస్తీనా తదితర అరబ్ దేశాలు తిరుగుతూ దైవ ధర్మప్రచారం చేశారు. ఏ ధర్మాన్నయితే స్వయాన తన తండ్రీ, స్వదేశ వాసులే తిరస్కరించారో దాన్ని పరాయి దేశవాసులు అంత తేలిగ్గా స్వీకరిస్తారా? అయినా మొక్కవోని విశ్వాసంతో హజ్రత్ ఇబ్రాహీం (అలై) జీవితాంతం వరకు ఏక దైవారాధన వైపునకు ప్రజల్ని ఆహ్వానించారు. ఫలితం కనబడన ప్పటికీ దాన్నే ఆయన విలువైన సంపదగా భావించేవారు.

ఎనభై ఆరేళ్ల వయసొచ్చినా సంతాన లేమి ఆయన్ను బాధిస్తూ ఉండేది. కనీసం ఒక్క కొడుకైనా కలిగితే తన తదనంతరం ఈ ధర్మాన్ని ప్రజలకు చేరవేసే అవకాశం ఉంటుందని అభిలషించే వారు. ఎట్టకేలకు దైవం ఆయన మొరను ఆలకించి ఓ కొడుకును ప్రసాదించాడు. కాని అంతలోనే మరొక విషమ పరీక్ష ఎదురైంది.

పిల్లవాడు కాస్త పెద్దవాడవగానే అతన్ని దైవ మార్గంలో అర్పించమని ఆజ్ఞాపించబడింది. ఇబ్రాహీం (అలై) వెంటనే దైవాదేశాన్ని ఆచరణలో పెట్టారు. ఈ ఆచరణకు మెచ్చిన దైవం ఆయనకు, సచ్ఛీలురైన ఆయన సంతానానికి ప్రపంచ నాయకత్వం అప్పగించాడు.

హజ్రత్ ఇబ్రాహీంను ఆయన ప్రభువు కొన్ని విషయాల్లో పరీక్షించినప్పుడు ఆయన వాటిలో పరిపూర్ణంగా ఉత్తీర్ణుడయ్యారు. అప్పుడు దేవుడు ఇలా అన్నాడు: నేను నిన్ను మానవుల నాయకుడిగా చేస్తున్నాను. అప్పుడు ఆయన మరి నా సంతానం విషయంలో ఏమిటి ఆజ్ఞ? అని అడిగారు. సమాధానంగా నీ సంతానంలో ఎవరైతే దౌర్జన్యపరులో వారికి నా ఆదేశం వర్తించదు. అని చెప్పడం జరిగింది.

తరువాత హజ్రత్ ఇబ్రాహీం (అలై) తనయుని సహాయంతో మక్కాలో ఓ కట్టడాన్ని నిర్మించారు. ఈ నిర్మాణం ఉద్దేశం దేశం నలుమూలల నుండి ప్రజలిక్కడ సమావేశమై ఏకదైవారాధనా సందేశాన్ని గ్రహించి తమతమ ప్రాంతాలకు దాన్ని తీసుకు వెళ్లడం. ఈ సమావేశం పేరే హజ్. దివ్య ఖుర్ఆన్ ఇలా అంటోంది:

"ప్రప్రథమంగా మానవుల కొరకు నిర్మించబడిన ఆరాధనా గృహం నిస్సందేహంగా మక్కాలో ఉన్నదే. దానికి సకల శుభాలు ప్రసాదించబడ్డాయి. విశ్వాసులందరికీ అది మార్గదర్శక కేంద్రం. దానిలో స్పష్టమైన సూచనలు ఉన్నాయి. ఇబ్రాహీం ప్రార్థనా స్థలమూ ఉంది. దానిలో ప్రవేశించిన వాడు రక్షణ పొందుతాడు"

హజ్రత్ ఇబ్రాహీం (అలై) ఇస్మాయీల్ (అలై) గార్ల తరువాత ప్రజలు ఇస్లాంపై ఎంత కాలం వరకు స్థిరంగా ఉన్నారో ఆ దైవానికే తెలుసు. మొత్తం మీద కొన్ని వందల ఏళ్ల తరువాత దేవుని ఏకత్వ కేంద్రంలో అజ్ఞాన భూతం ప్రవేశించింది. కాబా గృహంలో అర్థం పర్థంలేని ప్రతిమలు ప్రజలు ప్రతిష్టించారు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే హజ్రత్ ఇస్మాయీల్ అలైహిస్సలాం గారి సంతానమే ఇబ్రాహీం (అలై) ఇస్మాయీల్ (అలై) గారి విగ్రహాలనూ అందులో ప్రతిష్టించి దానికి పూజారులై కూర్చున్నారు. అప్పటి నుండి అదొక తీర్థ యాత్రా స్థలంగా రూపాంతరం చెందింది.

మక్కాలో ప్రతి సంవత్సరం హజ్ దినాల్లో జాతర జరిగేది. తినడం, తాగితందనాలాడడం, నగ్న ప్రదక్షిణలు చేయడం, మొక్కుబడులు చెల్లించడం గానకచ్చేరీలు జరపడం పరిపాటైపోయింది. పేరుకు హజ్ జరిగేది. కాని అంతా ధర్మవ్యతిరేకంగా జరిగేది.

దాదాపు రెండు వేల సంవత్సరాల వరకూ ఇంచుమించు ఇదే పరిస్థితి ఉండేది. చివరికి దైవం హజ్రత్ ఇబ్రాహీం గారు కాబా గృహాన్ని నిర్మించేటప్పుడు చేసిన ప్రార్థనను స్వీకరించాడు:

"ఓ నా ప్రభూ! మా యీ సేవను నీవు దయతో స్వీకరించు. నీవు అందరి మొరలు ఆలకించేవాడివి. అన్నీ తెలిసిన వాడివి. ప్రభూ! మా ఇద్దరినీ నీ విధేయులుగా చేసుకో. పూర్తిగా నీ విధేయతకే అంకితమయ్యే ఓ జాతిని మా సంతతి నుండి ఆవిర్భవింపజెయ్యి. నీ ఆరాధనా రీతుల్ని మాకు తెలుపు. మా తప్పుల్ని మన్నించు. నీవు అమితంగా క్షమించేవాడివి. అనన్యంగా కరుణించేవాడివి. ప్రభూ! నీ వాక్యాలు వారికి వినిపించి, నీ గ్రంథాన్ని, దివ్యజ్ఞానాన్ని వారికి బోధించి వారి జీవితాలను తీర్చిదిద్దే ఓ ప్రవక్తను వారి జాతి నుండే పుట్టించు. నీవు సాటిలేని సర్వాధికారివి. అనుపమ ప్రజ్ఞాశాలివి." ఫలితంగా - హజ్రత్ ఇబ్రాహీమ్ తనయుడు హజ్రత్ ఇస్మాయీల్ సంతతిలో దైవ ప్రవక్త ముహమ్మద్ (స) జన్మించారు. ఆయన కళ్ళు తెరవగానే కాబా గృహం విగ్రహాలయంగా దర్శనమిచ్చింది. పైగా దాని పూజారులు, పీఠాధిపతులు తన పూర్వీకులే.

వెంటనే ఆయన (స) తన తాత (ఇబ్రాహీం) గారి సంప్రదాయానికి ఊపిరిపోశారు. తన స్వహస్తాలతో తన పూర్వీకులు నెలకొల్పిన అవాంఛిత సిద్ధాంతాలను నేలమట్టం చేసి ఏకదైవారాధనకు ఊపిరులూదారు. తరువాత మరోసారి ప్రజలను ఏక దైవారాధనా కేంద్రానికి రావలసిందిగా పిలుపునిచ్చారు.

"ప్రజలపై అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమంటే ఈ గృహానికి వెళ్లగల స్థోమత ఉన్నవారు దాని హజ్‌ను విధిగా చెయ్యాలి. ఈ ఆజ్ఞను పాలించడాన్ని తిరస్కరించినవాడు, దైవం ప్రపంచం మొత్తం ఎడల నిరపేక్షాపరుడని తెలుసుకోవాలి."

ఈ విధంగా హజ్‌ను మరోసారి ఇబ్రాహీం(అలై) గారి సంప్రదాయానుగుణంగా ప్రారంభించి అజ్ఞానపు మూఢాచారాలన్నిటినీ రూపుమాపారు మహనీయ ముహమ్మద్ (సఅసం).

అంటే హజ్ మనకు వీలు కుదిరితే, ఇష్టమయితే నెరవేర్చి ఇష్టంలేకపోతే వదలి పెట్టే విధి కాదని దీన్ని బట్టి అర్థమవుతోంది. ఎవరికైతే దైవం ధన సంపదలు ప్రసాదించాడో వారు ఏమరుపాటుకు, అలసత్వానికి గురికాకుండా వెంటనే హజ్ విధిని నెరవేర్చాలి.





# త్యాగాల పర్వం... ప్రేమకు ప్రతిరూపం

- ఆలియా బిన్తె మునీర్ షర్ఫియా

**నాలుగున్నర వేల సంవత్సరాల క్రితం అరబ్ భూభాగంపై దైవ గృహం వద్ద జరిగిన మహోన్నత ఘటన. అద్భుత దృశ్యం అది. వృద్ధుడైన, దయా హృదయుడైన ఓ తండ్రీ తన గారాల బిడ్డతో.. "కుమారా! నేను నిన్ను జిబహ్(బలి) చేస్తున్నట్లుగా కలలో చూశాను. ఇక నీ అభిప్రాయమేమిటో చెప్పు."**

**"నాన్నగారూ! మీకు ఆజ్ఞాపించబడిన దానిని నెరవేర్చండి. అల్లాహ్ సంకల్పిస్తే మీరు నన్ను సహనశీలునిగా చూస్తారు."**

**స్వచ్ఛమైన త్యాగానికి ప్రతిరూపమైన ఆ మాటలు అల్లాహ్‌కు ఎంతగానో నచ్చాయి కాబట్టే తండ్రీకొడుకులు ఇబ్రాహీం, ఇస్మాయీల్‌ల మధ్య జరిగిన ఈ సంభాషణను ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించాడు.**

విధేయతకు ప్రతీక అయిన ఈ అద్భుత దృశ్యం చూసి అల్లాహ్ కారుణ్యం ఉప్పొంగింది. "ఇబ్రాహీం! నీవు కలను నిజం చేసి చూపించావు. సత్కార్యం చేసేవారికి మేము ఇలాంటి ప్రతిఫలాన్నే ఇస్తాము. నిశ్చయంగా ఇది ఒక స్పష్టమైన పరీక్ష" అన్నాడు అల్లాహ్. ఆ క్షణంలో ఆ బిడ్డ స్థానంలో ఒక పొట్టేలు ప్రత్యక్షమైంది. మేము ఒక పెద్ద ఖుర్బానీని పరిహారంగా ఇచ్చి ఆ బాలుణ్ణి విడిపించుకున్నాము. అతని కీర్తి ప్రతిష్టలు తరువాతి తరాల వారిలో శాశ్వతంగా నిలిచిపోయేలా చేసాము." (37: 107)

కొడుకు సంతోషంతో తన తలను నేలకు ఆన్చి బోర్ల పడుకోవడానికి కారణం కేవలం అల్లాహ్ ప్రసన్నత పొందాలని, ఆయన ఆజ్ఞాపాలనతో తన మెడపై కత్తి తిప్పాలనే గొప్ప సంకల్పం మాత్రమే. ఒక వృద్ధ తండ్రి తన ప్రియాతి ప్రియమైన సుపుత్రుడి ఛాతీపై మోకాలు మోపి అతని మెడపై పదునైన కత్తి తిప్పడానికి గల ఒకే ఒక్క కారణం దేవుని చిత్తం, ఆయన ఆజ్ఞా పాలన మాత్రమే.

ప్రపంచం అంతమయ్యేవరకు యావత్ ప్రపంచ ముస్లింలు ప్రతి సంవత్సరం ఇదే రోజున జంతువులను ఖుర్బానీ ఇచ్చి ఈ అద్భుత త్యాగాన్ని గుర్తు చేసుకోవాలన్నదే బక్రీదు పండుగ ఉద్దేశం.

ప్రవక్త ఇబ్రాహీం అలైహిస్సలాం జీవిత పుటలన్నీ త్యాగాలతో నిండి ఉంటాయి. ఆయన "త్యాగాలకు నిర్వచనం" అంటే సరిగ్గా సరిపోతుంది. అల్లాహ్ మార్గంలో ఖుర్బానీ (త్యాగం) ఇవ్వాలి అనుకున్న వారు ఆయన అలైహిస్సలాం వారి జీవితాన్ని అధ్యయనం చేయాలి. అల్లాహ్ కోసం ఆయన తల్లిదండ్రులకు దూరమయ్యారు. వారి ఆస్తిపాస్తులను కాదనుకున్నారు.

కుటుంబం, సమాజ ఆదరణకు దూరమయ్యారు. వంశ పారంపర్య పదవిని కోల్పోయారు. జన్మస్థలం నుండి వలస వెళ్లారు. అల్లాహ్ కోసమే నమ్రూద్ రాజేసిన అగ్నిగుండంలో ఏ ప్రమాదాన్ని లెక్కచేయకుండా ప్రాణాలకు తెగించి దూకారు. అల్లాహ్ మెప్పు కోసమే తన ప్రియమైన సతీమణి, ఒక్కగానొక్క సంతానాన్ని ఎడారి ప్రాంతంలో వదిలేశారు.

ఇబ్రాహీం(అ) గురించి స్వయంగా అల్లాహ్ ఇలా అంటున్నాడు : "ప్రపంచంలో మా సేవ కొరకు మేము ఎన్నుకున్న వ్యక్తి ఇబ్రాహీము, పరలోకంలో అతను సజ్జనులతోపాటు ఉంటాడు. అతను ఎలాంటివాడంటే, "ముస్లిం అయిపో" అని అతని ప్రభువు అతనితో అన్నప్పుడు అతను వెంటనే, నేను విశ్వ ప్రభువు యొక్క "ముస్లింను" అయిపోయాను ." అని జవాబు పలికాడు. (2:131)

ఇస్లాం అంటే విధేయత. తనను తాను పూర్తిగా అర్పించుకోవడం, ఇంకా స్వచ్ఛమైన విశ్వాసం. ఎవరైతే అల్లాహ్‌కు పూర్తిగా విధేయులై జీవితాన్ని గడుపుతున్నారో, ఎవరైతే జీవితపు ప్రతీ వ్యవహారంలో తమ సర్వస్వాన్ని అంకితం చేసుకున్నారో వారు మాత్రమే ఖుర్బానీ చేయగలరు.

ఒకవేళ మీ జీవితం దీనంతటికీ సాక్ష్యంగా నిలవలేకపోతే మీరు పరిపూర్ణ విశ్వాసులు కారు. మీరు మీ పూర్తి జీవితాన్ని అల్లాహ్‌కు అంకితం చేయలేకపోతే మీరు కేవలం కొన్ని జంతువుల రక్తం చిందించి ఇబ్రాహీం అలైహిస్సలాం వారి సంప్రదాయాన్ని నెమరు వేయలేరు. ఇంకా మీరు ఖుర్బానీ చేస్తున్నప్పుడు ఏ వాగ్దానమైతే అల్లాహ్‌తో చేస్తారో దానిని పరిపూర్తి చేయలేరు.

ప్రపంచంలోని ముస్లింలు ఆ రోజున ఖుర్బానీ ఇచ్చి అల్లాహ్‌తో "ఓ సర్వలోకాల ప్రభువు! మేము నీకు విధేయులం, నీ ఆజ్ఞ పాలన చేయడమే మా లక్ష్యం. మేము నీకే విధేయత చూపుతామని ప్రకటిస్తున్నాము. మన పెద్దలు ఇస్మాయీల్ (అలై) వారిలా నీ సన్నిధిలో మా తలలను హాజరు పరుస్తు న్నాము. నీవే ఈ సంప్రదాయాన్ని జారీ చేసి ఇస్మాయీల్ వారిని విడిచి పెట్టావు. మేము అలాగే ఖుర్బానీ ఇస్తున్నాము. నువ్వు ఆజ్ఞాపిస్తే మేము మా ప్రాణాలను సైతం నీ మార్గంలో అర్పించడానికి వెనుకాడము. మేము నీకు చెందిన వారమే. మాదంతా నీకు చెందినదే. మేము నీ విధేయులం, ప్రాణ త్యాగానికి సిద్ధమైన నీ దాసులు హజ్రత్ ఇబ్రాహీం(అలై), ఇస్మాయీల్ (అలై) వారిని అనుసరించే వారము.' ఖుర్బానీ చేసేటప్పుడు చదివే దుఆకు భావార్థం ఇది. ఈ వాక్యాలు విశ్వాసానికి, దైవం పట్ల ప్రేమకు నిదర్శనం.

భయభక్తులు, వినయ విధేయతలతో కూడిన అమూల్యమైన భావాలు ఖుర్బానీకి ఆత్మలాంటివి. భయభక్తులు గలవారు, విధేయులు, ప్రాణ త్యాగానికి కూడా వెనుకాడని స్వచ్ఛమైన భావాలు గలవారి ఖుర్బానీయే అల్లాహ్ వద్ద స్వీకారయోగ్యం. భయభక్తులు, స్వచ్ఛత, విశ్వాసం, ప్రాణత్యాగ భావాలు ఇవన్నీ కేవలం మీరు అల్లాహ్‌ను గుర్తు చేసుకుంటూ ఉండడంతో, ఏమైనా ప్రత్యేక ఆచరణలు అప్పుడప్పుడు చేసుకోవడంతో జనించవు. మీ ఆలోచనలు, చింతన, భావాలు, నైతిక విలువలు, వ్యవహారాలు అల్లాహ్ ఆదేశాల ప్రకారం నడుచుకున్నప్పుడే జనిస్తాయి.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

89 ఆయత్‌లు

# 43. అజ్ జుఖ్రుఫ్

28– 30 ఆ సందర్భాన్ని గుర్తుకు తెచ్చుకోండి, అప్పుడు ఇబ్రాహీమ్ తన తండ్రినీ, తన జాతినీ సంబోధించి ఇలా అన్నాడు, "మీరు ఆరాధించేవాటితో నాకు ఎటువంటి సంబంధమూ లేదు. నన్ను సృష్టించిన వానితోనే నా సంబంధం. ఆయనే నాకు మార్గనిర్దేశన చేస్తాడు." ఇబ్రాహీమ్ ఇదే వచనాన్ని[26] తన తరువాత తన సంతానంలో వదలిపెట్టి వెళ్ళాడు, వారు దాని వైపునకు మరలడానికి.[27] (ఇంతజేసీ ఈ జనులు ఇతరుల దాస్యమే చేయసాగినప్పుడు నేను వారిని తుడిచివేయలేదు) బదులుగా నేను వారికీ వారి తాతముత్తాతలకు జీవన సామగ్రిని ఇస్తూనే వచ్చాను. కడకు వారి వద్దకు సత్యం (తో పాటు) విడమర్చి వివరంగా తెలిపే దైవ సందేశహరుడు[28] వచ్చేశాడు. కాని ఆ సత్యం వారి వద్దకు వచ్చినప్పుడు వారు, ఇదయితే మంత్రజాలం,[29] మేము దీన్ని స్వీకరించడానికి నిరాకరిస్తున్నాము అని అనేశారు.

26. అంటే, సృష్టికర్త తప్ప మరెవరూ ఆరాధ్యులయ్యేందుకు అర్హులు కారు అన్నమాట.

27. అంటే, వారు రుజుమార్గానికి ఎప్పుడు ఏమాత్రం దూర మయినా ఈ వచనం వారి మార్గదర్శనానికి సిద్ధంగా ఉంటుంది, వారు దీని వైపునకే మరలి రాగలగాలి. ఈ సంఘటనను ఇక్కడ ప్రస్తావించడానికి కారణం కురైష్ తిరస్కారుల అసమంజసతను పూర్తిగా బట్టబయలు చేయడం ఇంకా మీరు మీ పూర్వీకుల అనుసరణను అవలంబించడంలోనూ మీ అత్యుత్తమ పూర్వీకులను వదలి అత్యంత దుష్టులయిన పూర్వీకులను ఎన్నుకున్నారు అనే విషయాన్ని తెలిపి వారిని సిగ్గిల్ల చేయడం. అరేబియాలో కురైష్ పెత్తనం కొనసాగేదంటే, వారు మహనీయ ఇబ్రాహీమ్, ఇస్మాయీల్ సంతానం అవడం చేతనే. ఇంకా ఆ మహనీయులు నిర్మించిన కాబా దైవగృహానికి పీఠాధిపత్యం వహిస్తూ ఉండటం చేతనే. అందువల్ల వారు అనుసరణ చేయవలసి ఉంటే ఆ మహనీయులనే అనుసరించవలసింది కాని తమ మూర్ఖులయిన పూర్వీకులను కాదు. వారి ఈ పూర్వీకులు మహనీయ ఇబ్రాహీమ్, ఇస్మాయీల్ (అ)ల విధానాన్ని వదలిపెట్టి చుట్టుపట్ల నున్న విగ్రహారాధకుల ద్వారా బహుదైవారాధనను నేర్చుకున్న వారు. ఇక్కడ ఈ సంఘటనను ప్రస్తావించి మరో కోణంలోనూ ఈ మార్గవిహీనులయిన ప్రజల తప్పులను విశద పరచడం జరిగింది. అదేమిటంటే, సత్యాసత్యాల వ్యత్యాసాన్ని పాటించ కుండా తాతముత్తాతలను కళ్ళు మూసుకుని అనుసరించడం సరయినదే అయినట్లయితే అందరికన్నా ముందు హజ్రత్ ఇబ్రాహీమ్ స్వయంగానే ఈ పనిచేసేవారు. కాని ఆయన అతి స్పష్టంగా తన తండ్రికి, జాతికి చెప్పివేశారు, నేను మీ ఈ అజ్ఞాన పూర్వకమయిన మతాన్ని అనుసరించలేను. ఇందులో మీరు మీ సృష్టికర్తను కాదని సృష్టికర్తలు కాని అస్తిత్వాలను ఆరాధ్యులుగా చేసుకున్నారు. దీన్నిబట్టి హజ్రత్ ఇబ్రాహీమ్ తల్లి దండ్రుల అనుసరణను నమ్మేవారు కారని తెలిసిపోతోంది. ఆయన గారి పంథా ఏమిటంటే, తల్లిదండ్రుల అనుసరణకు పూర్వం కళ్ళు తెరచి చూసుకోవాలి, వారు సరయిన మార్గాన ఉన్నారా లేదా అని. సమంజసమయిన సహేతుకమయిన ఆధారాలతో వారు తప్పు దారిన సాగుతున్నారని తెలిసిపోతే వారి అనుసరణను వదలి, ఆధారం రీత్యా సత్యమయిన విధానాన్ని అవలంబించాలి.

28. మూలంలో 'రసూలుమ్ముబీన్' (విడమర్చి వివరంగా తెలిపే దైవసందేశహరుడు) అనే పదాలు ప్రయోగించబడ్డాయి. దీనికి మరో భావం, ఈయన దైవ సందేశహరుడు అవడం మరీ బాహాటంగా వెల్లడయిన విషయం అనీ కావచ్చు; ఈయన దైవ దౌత్యానికి మునుపు సాగిన జీవితం, తరువాతి జీవితం ఆయన నిస్సందేహంగా దేవుని సందేశహరుడే అని అతి స్పష్టంగా సాక్ష్యం ఇస్తున్నాయన్నమాట.

29. వివరాలకు చూడండి ఖుర్ఆన్ అవగాహనం, సం.4, అల్ అన్బియా: పాద సూచి 5 సం.7, సాద్ : పాద సూచి 5.

## అధ్యాయం : 65

# మహనీయ అబూజర్ గిఫ్ఫారీ(రజి) ఇస్లామ్ స్వీకరించిన సంఘటన

**490)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: మహాప్రవక్త ముహమ్మద్(స) ప్రవక్తగా ప్రకటించుకున్నారన్న సంగతి అబూజర్ గిఫ్ఫారీ(రజి)కి తెలిసినప్పుడు ఆయన తన తమ్ముడు అనీస్‌ను పిలిచి, 'మక్కా వెళ్ళేందుకు వాహనాన్ని సిద్ధం చేసుకో. తనను ప్రవక్తగా ప్రకటించుకుని, తన వద్దకు ఆకాశం నుండి సందేశం వస్తుందని చెబుతున్న వ్యక్తి గురించి సమాచారం రాబట్టు. అతని మాటల్ని శ్రద్ధగా విను. ఆ తర్వాతే నా దగ్గరకు రావాలి' అని పురమాయించారు. ఆయన తమ్ముడు మక్కా నగరానికి వచ్చి, దైవప్రవక్త(స) మాటల్ని స్వయంగా విన్నారు. ఆ తరువాత తిరిగి వచ్చి, అబూజర్(రజి)తో ఇలా అన్నారు : 'నేనాయన్ని స్వయంగా చూశాను. ఆయన(స) మంచి నీతి నడవడికలను గురించి ప్రజలకు ఆజ్ఞాపిస్తున్నారు. ఆయన చెప్పేది కవిత్వం మాత్రం కాదు'. అంతా విని, 'నేను ఏ ఉద్దేశంతో నిన్ను పంపించానో, దానిపై నేను పూర్తిగా సంతృప్తి చెందలేదు' అని చెప్పారు.

ఆ తరువాత ఆయన స్వయంగా ప్రయాణ సన్నాహం చేసుకున్నారు. చద్ది మూట కట్టుకున్నారు. నీళ్ళతో నిండిన ఒక పాత నీళ్ళ తిత్తిని కూడా వెంటబెట్టుకుని బయలుదేరారు. మక్కా నగరానికి చేరుకుని మస్జిదె హరామ్(కాబా)ను సందర్శించారు. అక్కడ దైవప్రవక్త(స)ను అన్వేషించారు. అబూజర్ దైవప్రవక్త(స)ను గుర్తుపట్టలేదు. ఆయన గురించి వేరితరులను అడగటం కూడా భావ్యం కాదనుకున్నారు. కొంత రాత్రి గడిచింది. ఆయన పడుకుని ఉన్నారు. అంతలో హజ్రత్ అలీ(రజి) వచ్చి, ఆయన్ని చూసి ఎవరో బహుదూరపు బాటసారి అనుకున్నారు. 'మీరు మా ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకోండి' అని కోరారు అలీ. అబూజర్ ఆయన వెనకాలే నడిచి వెళ్ళారు. కాని వారిరువురూ ఒండొకరితో మాట్లాడుకోలేదు. తెల్లవారగానే అబూజర్ తన మూటాముల్లె సర్దుకుని మస్జిదె హరామ్‌కు తిరిగి వచ్చేశారు. ఆ రోజు పగలు కూడా అలాగే గడిచిపోయింది. దైవప్రవక్త(స)ను ప్రత్యక్షంగా చూడలేకపోయారు. రాత్రి పొద్దుగూకగానే నిద్రకు ఉపక్రమించారు. అలీ (రజి) ఆ రోజు రాత్రి కూడా అటువైపు నుండి సాగిపోతూ బహుశా ఈ బాటసారికి తన గమ్య స్థానాన్ని చేరుకునే సమయం ఆసన్నం కాలేదేమో అనుకున్నారు. అందుకే ఆ రోజు రాత్రి కూడా ఆయన్ని తన ఇంటికి తీసుకెళ్ళారు. కాని ఈ రాత్రి కూడా వారు పరస్పరం సంభాషించుకోలేదు. మూడో రోజు రాత్రి కూడా అదే కథ. కాని ఈసారి అలీ(రజి) అడిగారు- మీ రాకలోని ఉద్దేశం ఏమిటో తెలుసుకోవచ్చా? అని. దానికి అబూజర్, 'నా అన్వేషణా మార్గంలో సహాయపడతానని గట్టి వాగ్దానం చేసే మాటైతే నేను మీకు అంతా వివరంగా చెబుతాన'న్నారు. అలీ వాగ్దానం చేసిన మీదట, అంతా వివరంగా చెప్పారు అబూజర్ గిఫ్ఫారీ.

అంతా విన్నాక, 'అవును. ఆయన (స) సత్యపథంలో ఉన్నారు. ఆయన దేవుని సత్యవంతుడైన ప్రవక్త. సరే, రేపు ఉదయం మీరు నా వెనకే నడిచి రండి. దారిలో ఏదన్నా ప్రమాదం పొంచి ఉందని భావిస్తే నేను (ఏదయినా గోడ

ప్రక్కన) నిలబడిపోతాను, మూత్ర విసర్జన కోసం అన్నట్టు. ఆ సమయంలో మీరు నా కోసం నిరీక్షించకుండా ముందుకు సాగిపోండి. ఆ తరువాత నన్ను అనుసరించండి. వీళ్ళిద్దరూ ఒక్కటేనని జనులకు అనుమానం రాకుండా ఉండటానికి ఇలా జాగ్రత్త పడటం అవసరం. చివరకు నేను ఏ ఇంట్లో ప్రవేశిస్తే ఆ ఇంట్లోకి మీరు కూడా రావాలి' అని అలీ(రజి) సూచించారు. అబూజర్ అలాగే చేశారు. ఎట్టకేలకు ఆయన అలీ(రజి)తోపాటు దైవప్రవక్త (స) సన్నిధికి చేరుకున్నారు. ప్రవక్త(స) ఉపదేశాన్ని విన్నారు. అక్కడే ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. తరువాత దైవ ప్రవక్త(స) ఆయనకు ఇలా ఉపదేశించారు: "ఇక నీవు నీ తెగ వారైన గిఫ్ఫార్ వద్దకు వెళ్ళిపో. వారికి నా గురించి చెప్పు. నేను ప్రాబల్యం వహించినట్లుగా సమాచారం అందినప్పుడు నా దగ్గరకు రా". దానికి అబూజర్ గిఫ్ఫారీ, 'ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నాను. నేను ఖురైషులు గుమిగూడి ఉన్నచోట దేవుని ఏకత్వపు వచనాన్ని (కలిమాను) ఎలుగెత్తి ప్రకటిస్తాను' అన్నారు. అన్నట్లే ఆయన దైవప్రవక్త(స) వద్ద నుండి మస్జిదె హరామ్‌కు తిరిగి వచ్చి, బిగ్గరగా 'అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేదని, ఇంకా ముహమ్మద్ (స) దైవప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను' అన్నారు. ఇది వినగానే అక్కడున్న వాళ్ళంతా ఆయనపై అమాంతం విరుచుకుపడ్డారు. చితకబాదారు. ఆ దెబ్బలకు తట్టుకోలేక ఆయన నేలకొరిగారు. అంతలో అబ్బాస్(రజి) వచ్చి, అబూజర్(రజి)పై (డాలుగా) పడి పోయి ఖురైషులకు చీవాట్లు పెట్టారు. 'మీ ధోరణి కడు శోచనీయం. ఈ వ్యక్తి గిఫ్ఫార్ తెగకు చెందినవాడన్న సంగతి మీకు తెలీదా? సిరియాకు వెళ్ళే మీ వర్తక బిడారాలన్నీ ఇతని ప్రాంతం మీదుగానే సాగిపోవాల్సి ఉంటుంది' అని చెప్పి అబూజర్‌ను రక్షించారు. రెండో రోజు కూడా అబూజర్ మస్జిదె హరామ్‌కు వచ్చి, తాను ఇస్లామ్ స్వీకరించినట్లు ప్రకటించారు. ఆ రోజు కూడా జాతి ప్రజలు ఆయనపై విరుచుకు పడ్డారు. ఈసారి కూడా అబ్బాస్(రజి) ఆయనపై బోర్లాపడి రక్షించారు.[1]

490-1. మహనీయ అబూజర్ గిఫ్ఫారీ(రజి) ఉన్నత శ్రేణి సహాబాలో ఒకరు. ఐహిక అనాసక్తత గల ముహాజిర్. ఈయన అసలు పేరు జున్దబ్. మక్కాలో ఇస్లామ్ స్వీకరించిన తొలి వారిలో ఈయన ఐదవవారు. తరువాత తన తెగ వారి వద్దకు వెళ్ళిపోయారు. కందక యుద్ధ సందర్భంగా మదీనా వచ్చి దైవప్రవక్త(స)ను కలుసుకున్నారు. హిజ్రీ 32లో మరణించారు.


సహజీవన భావనల పావురాయి గీటురాయి వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.


'చరితార్థులు'-2



# హుస్సేన్ రహీం

## (1865-1987)

**51**




**భారత** స్వాతంత్ర్యోద్యమంలో ఒక విశిష్టత కలిగిన 'కొమగాట మారు నౌక' సంఘటనకు సంబంధించిన పోరాటంలో ప్రముఖ పాత్ర నిర్వహించిన హుస్సేన్ రహీం 1865లో గుజరాత్‌కు చెందిన వర్తక-వ్యాపారం వృత్తిగా గల కుటుంబంలో జన్మించారు. ఆయన చిన్నతనం ఢిల్లీలో గడిచింది. పంజాబీ, హిందీ, గుజరాతి భాషలతోపాటుగా పలు ఇతర భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన ఆయన కుటుంబ వృత్తిలోకి ప్రవేశించారు. పలు వ్యాపారాలను నిర్వహిస్తూ 30వ ఏట జపాన్ చేరుకున్నారు. జపాన్‌లోని కోబే పట్టణం కేంద్రంగా వ్యాపారం సాగించిన ఆయనకు మాతృభూమి విముక్తి కోసం పోరాడుతున్న విప్లవ పోరాట యోధులతో పరిచయం కలిగింది. 1910లో వ్యాపార అవసరాల నిమిత్తం యూరప్, ఆసియా దేశాలను పర్యటించి వచ్చిన ఆయన కోబే నుండి కెనడాలోని వాంకోవర్ చేరుకున్నారు. ఒక వైపున రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పాల్గొంటూ అక్కడున్న విముక్తి పోరాటయోధులతో జతకట్టారు. ఆంగ్లంలో 'హిందుస్థాని' అను పత్రికను ప్రారంభించి, ఆ పత్రిక ద్వారా ఇటు భారతదేశంలోని అటు బ్రిటిష్ ఆధిపత్యంలోని భారతీయుల స్థితిగతులను, విముక్తి ఉద్యమాల సమాచారాన్ని ప్రజలకు అందించారు. విప్లవకారులకు సహకరిస్తూ 'వాంకోవర్‌లో ప్రమాదకర వ్యక్తి'గా ఆయన ప్రభుత్వ రికార్డులలోకి ఎక్కారు. ఆ తరువాత 'సోషలిస్ట్ పార్టీ ఆఫ్ కెనడా' సభ్యులయ్యారు. 1914 ఏప్రిల్ నాలుగున భారతీయులతో కలిసి హాంకాంగ్ నుండి బయలుదేరిన 'కొమగాట మారు నౌక' కెనడాలోని వాంకోవర్ చేరుకుంది. కెనడా ప్రభుత్వం నౌకలోని భారతీయులకు తమ దేశంలో ప్రవేశం నిరాకరించింది. ఈ సందర్భంగా ఏర్పడిన సంక్షోభం నివారణకు ఏర్పడిన 'షోర్ కమిటి'లో సభ్యులుగా హుస్సేన్ రహీం ప్రధాన బాధ్యతలు నిర్వహించారు. భారతీయుల హక్కుల పరిరక్షణకు సహచరులు షోహన్‌లాల్‌తో కలిసి ప్రభుత్వ చర్యలను సవాల్ చేస్తూ నిర్భయంగా పోరాడారు. ఆయనను కెనడా ప్రభుత్వం నిర్బంధించింది. అటు పిమ్మట 'కొమగాటమారు నౌక'ను ఇండియాకు పంపటం, ఆ నౌక కలకత్తా చేరడం, కలకత్తాలో నౌకలోని వ్యక్తులను విప్లవకారులుగా పరిగణించిన ఆంగ్ల ప్రభుత్వం విచక్షణారహితంగా కాల్పులు జరపగా నౌకలోని ప్యాసింజర్లు తిరగబడిన కారణంగా 20 మంది మృత్యువాత పడటంతో 'కొమగాటమారు నౌక' చరిత్రలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆ తరువాత కెనడా ప్రభుత్వం హుస్సేన్ రహీం మీద చేసిన నేరారోపణలను రుజువు చేయలేక పోవడంతో నిర్బంధం నుండి ఆయన విడుదలయ్యారు. మాతృభూమి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఆకాంక్షిస్తూ చివరి వరకు గడిపిన హుస్సేన్ రహీం 1937లో వాంకోవర్‌లో కన్నుమూశారు. ❑



9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



# ఖుర్బానీ ప్రాశస్త్యం

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**దైవదాసులు** పుణ్యాలు చేసి అత్యంత శ్రేష్ఠమయిన సామగ్రి అయిన 'తఖ్వా'ను మూట కట్టుకోవాలనీ, వారి జీవితాలు పునీత మవ్వాలనీ ఆ పరమదాత కొన్ని వసంత రుతువుల్ని కేటాయిం చాడు. ఆ శుభవంతమయిన, పవిత్రమయిన రుతువుల్లో ఓ పుణ్య రుతువే జుల్ హిజ్జ మాసపు మొదటి పది రోజులు. ఆ విషయాని కొస్తే, ప్రవక్త (స)వారి కాలం నుండి సజ్జనులయిన మన పూర్వీకులు మూడు పదులను గొప్పవిగా భావించేవారు. 1) జుల్‌హిజ్జా మొదటి పది రోజులు. 2) రమజాను మాసపు చివరి పది రోజులు. 3) ముహర్రమ్ మాసపు తొలి పది రోజులు.

అల్లాహ్ కొన్ని ప్రత్యేక సమయాలను ఇతర సమయాలపై, కొన్ని నెలలను ఇతర నెలలపై, కొన్ని దినాలను, రాత్రులను ఇతర దినాలు, రాత్రులపై ప్రాముఖ్యత నిచ్చి శుభప్రదమైనవిగా ఖరారు చేశాడు. ఆ ప్రత్యేక దినాలలో చేయబడే పుణ్యకార్యాలు అనేక రెట్లు గణింపబడతాయి. ఆ ప్రత్యేక, శుభప్రదమైన దినాలలో జుల్‌హిజ్జ మాసపు పది దినాలు కూడా ఉన్నాయి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "నిశ్చయంగా నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర- అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజు నుంచే (ఈ లెక్క ఇలాగే సాగుతున్నది).

వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (గౌరవప్రదమైనవి). ఇదే సరైన ధర్మం". (తౌబా:36)

అంతిమ దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "కాలం తిరిగి యథాస్థితికి- అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించిన నాటి స్థితికి వచ్చేసింది. ఏడాదిలో పన్నెండు మాసాలుంటాయి. వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (పవిత్రమైనవి). వాటిలో మూడు మాసాలు ఒకదాని తరువాత ఒకటి వస్తాయి. అవే- జుల్ ఖఅద, జుల్‌హిజ్జ, ముహర్రం, నాల్గవ మాసం రజబ్. ఇది జమాదివుల్ ఆఖిర్- షాబాన్ నెలలకీ మధ్య ఉంటుంది". (బుఖారి)

## ఖుర్బానీ ప్రాశస్త్యం

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ఉపదేశించారు: "జుల్ హిజ్జ పదవ తేది (పండుగ రోజు) ఆదం పుత్రుడు ఇచ్చే ఖుర్బానీకన్నా అల్లాహ్ దృష్టిలో మరే పుణ్య కార్యమూ గొప్పది కాదు. ఖుర్బానీ జంతువులు ప్రళయం నాడు తమ కొమ్ములు, ఖురములు, వెంట్రుకలతో సహా వచ్చి సాక్ష్యమిస్తాయి. అలాగే ఖుర్బానీ పశువు రక్తం నేలపై పడక ముందే అల్లాహ్ దగ్గర దాని ఖుర్బానీ ఎంతో ఘనతాదరణలతో స్వీకరించబడుతుంది. కనుక మీరు సంతోషంగా, మనస్ఫూర్తిగా ఖుర్బానీ ఇస్తూ ఉండండి". (తిర్మిజీ).

## ఖుర్బానీ అంటే

జుల్‌హిజ్జ మాసపు 10వ తేదీన అనగా పండుగ రోజు పండుగ నమాజు తర్వాత నుండి 13 జుల్‌హిజ్జ తేదీన సూర్యాస్తమయం వరకు దైవ ప్రసన్నత కోసం పశువుని జబహ్ చేయడాన్ని ఖుర్బానీ అంటారు.

## ఖుర్బానీ ఆదేశం

ఖుర్బానీ చేయాలని అల్లాహ్ ఆదేశించాడు: ''నీ ప్రభువు కోసమే నమాజు చెయ్యి, ఖుర్బానీ ఇవ్వు.'' (కౌసర్:2)

ప్రముఖ సహాబీ అనస్ (ర) ఇలా తెలియజేసారు: ''దైవప్రవక్త ముహమ్మద్(స) రెండు పొట్టేళ్ళను ఖుర్బానీ ఇచ్చేవారు కాబట్టి నేను కూడా రెండు పొట్టేళ్ళను ఖుర్బానీ ఇచ్చేవాడిని. (బుఖారీ)

## ఖుర్బానీ ప్రాముఖ్యత

స్థోమత ఉన్న ప్రతి వ్యక్తిపై ఖుర్బానీ చేయడం "వాజిబ్" తప్పనిసరి అని అధిక శాతం పండితుల అభిప్రాయం.

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలియజేసారు: ''స్థోమత, సౌకర్యం ఉండి కూడా ఖుర్బానీ ఇవ్వని వ్యక్తి మా ఈద్గాహ్ (పండుగ నమాజు చేసే బహిరంగ మైదానం) దరిదాపులకు కూడా రాకూడదు. (అహ్మద్, ఇబ్నెమాజ- సహీహ్)

## ఖుర్బానీ పశువులు- లక్షణాలు

ఒంటె ఆడదైనా, మగదైనా, ఆవు- ఎద్దు, మేక- పోతు, గొర్రె- పొట్టేలు

ఈ నాలుగు రకాల పశువులు మాత్రమే ఖుర్బానీ ఇవ్వాలి. ఇవికాక ఇతర జంతువుల ఖుర్బానీ చెల్లదు. (22/34)

గేదె, దున్నపోతులను ఖుర్బానీ చేయాలనుకుంటుంటారు కొందరు- కానీ అవి ఖుర్బానీ జంతువులు కావని గ్రహించాలని మనవి చేస్తున్నాము.

ఖుర్బానీ ఇవ్వబడే పశువు బాగా బలంగా, లావుగా, లోపాలు లేకుండా ఉత్తమమైనదిగా ఉండాలి. (ఇబ్నెమాజ)

రెండు కొమ్ములు గల, ఖసీ చేయబడిన పశువైతే మంచిది. (ఇబ్నెమాజ)

మేక, పోతు, గొర్రె, పొట్టేలు పళ్ళు (పాల పళ్ళు వూడిన తరువాత వచ్చే పళ్ళు) గలదై ఉండాలి. దొరకని సందర్భంలో ఒక సంవత్సరం వయసు గలది లేక సంవత్సరానికి కొంచెం తక్కువ వయసుగల పొట్టేలు సరిపోతుంది. (ముస్లిం)

మంచి పశువు లభ్యమవుతున్నా పిసినారితనం ప్రదర్శించటం, డబ్బులు మిగిలించుటకు చిన్న పశువును కొనటం భక్తునికి తగిన విషయం కాదు.

ఒంటెకు 5 సంవత్సరాలు పూర్తయి 6వ సంవత్సరం జరుగు తుండాలి. (షరహ్ సునన్ అబీ దావూద్ ఉర్దూ 2/628)

ఒంటికన్ను పశువు, కుంటి పశువు, రోగగ్రస్త పశువు ఎముకల్లో సత్తువ లేకుండా బాగా ముసలిదైపోయిన పశువులను ఖుర్బానీ చేయకూడదని ప్రవక్త(స) తెలిపారు. (తిర్మిజి, ఇబ్నెమాజ, అహ్మద్)

ఇవి కాక మరే ఇతర లోపం బహిర్గతంగా కనబడుతున్నా అలాంటి పశువును ఖుర్బానీ చేయరాదు. కనిపించని చిన్న లోపమైతే ఇన్షాఅల్లాహ్ క్షమించబడుతుంది.

ఏ పశువు ఖుర్బానీ ఉత్తమమైనది? ధార్మిక పండితులు ఈ విషయంలో భిన్నాభిప్రాయలు కలిగి ఉన్నారు.

- పొట్టేలు ఖుర్బానీ ఉత్తమమైనదనీ కొందరి అభిప్రాయం. ''ప్రవక్త (స) ప్రతి సంవత్సరం పొట్టేలు ఖుర్బానీ ఇచ్చారు'' అన్నది వీరి ఆధారం.

- అధిక శాతం పండితులు పశువు విలువ, మాంసము, ఇతర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ క్రమపద్ధతిని తెలిపారు:

(1) ఒంటె ఒక్కరి తరపున ఇవ్వబడితే ఉత్తమమైనది.

(2) ఆవు ఒక్కరి తరపున ఇవ్వబడితే ఉత్తమమైనది.

(3) పొట్టేలు, గొర్రె, మేక, పోతు వీటిలో ఏదైనా ఒక్కరి తరపున ఇవ్వబడితే.

(4) ఒంటె కొందరు వ్యక్తులు కలిసి ఇస్తే.

(5) ఆవు కొందరు వ్యక్తులు కలిసి ఇస్తే. (ఫతావా ఇస్లామీయ 2/320)

## ఖుర్బానీ పశువులో భాగాలు, భాగస్తులు

స్థోమత ఉన్నవారు ఒక పశువు ఒంటె, లేక ఆవు, లేక పొట్టేలు వీటిలో ఏదైనా ఒకటి ఒకే మనిషి తరపున ఖుర్బానీ ఇవ్వడం ఉత్తమం.

ఒక ఒంటెనుగాని, ఆవును గాని, పొట్టేలుని గాని ఇంటి యజమాని తన కుటుంబీకుల తరపున ఖుర్బానీ ఇవ్వచ్చు. (తిర్మిజి, ఇబ్నెమాజ)

వివరణ: ఒక కుటుంబం అంటే, అందరి పోషణా బాధ్యత ఒకే వ్యక్తిపై ఉంటుంది.

ఇకపోతే అన్నదమ్ములూ వారందరి సంపాదన వేరు. పొదుపు వేరు. వారిలోని ప్రతి ఒక్కరూ తమ భార్యాబిడ్డల్ని పోషణా బాధ్యతను స్వయంగా నిర్వర్తిస్తున్నారు. అందరూ కలిసి తల్లిదండ్రుల దగ్గర పండుగ జరుపుకుంటే ఒకే కుటుంబంగా పరిగణించబడినప్పటికీ, అందరి సంపాదన, పొదుపు, ఖర్చులు

వేరువేరుగా ఉండటం వలన ప్రతి ఒక్కరిపై ఖుర్బానీ వాజిబ్ అవుతుంది.

అతా బిన్ యసార్ (ర) ఇలా తెలియజేసారు:

నేను అబూ అయ్యూబ్ అన్సారీ (రజి)తో ప్రవక్త (స) కాలంలో ఖుర్బానీ ఎలా చేయబడేదని అడిగాను? ప్రతి మనిషి తన తరపున తన కుటుంబీకుల తరపున ఒక మేక ఖుర్బానీ ఇచ్చేవాడు. ప్రజలు స్వయంగా తిని ఇతరులకు కూడా తినిపించేవారని ఆయన బదులిచ్చారు. (తిర్మిజి)

ఒక కుటుంబ యజమాని తన తరపున తన కుటుంబీకుల తరపున ఒక పశువును ఖుర్బానీ ఇచ్చినచో ఆ కుటుంబంలోని ప్రతి వ్యక్తి తన పేరిట ప్రత్యేకంగా ఒక పశువుని ఖుర్బానీ చేయడం వాజిబ్ (తప్పనిసరి)కాదు.

ఇమామ్ షౌకానీ (ర) ఇలా తెలియజేసారు: వాస్తవమేమిటంటే ఒక్క మేక పూర్తి ఒక కుటుంబం తరపున సరిపోతుంది, బహుశా ఆ ఒక కుటుంబం 100 మంది వ్యక్తుల్ని కలిగి ఉన్నా సరే. (నైలుల్ ఔతార్ 5/143)

ఒక సంవత్సరం తన పేరిట మరో సంవత్సరం తల్లి పేరిట ఆ తర్వాత తండ్రి పేరిట ఆపై భార్య, కుమారుడు, కుమార్తె అంటూ ఒక్కో సంవత్సరం ఒకరి పేరిట మాత్రమే ఖుర్బానీ ఇచ్చి అదే కుటుంబానికి చెందిన ఇతరులు స్థోమత ఉండి కూడా ఖుర్బానీకి దూరంగా ఉండటం ప్రవక్త(స) నేర్పిన విధానానికి విరుద్ధమైన అలవాటని గ్రహించాలి. పూర్తి కుటుంబం తరపున పశువు ఖుర్బానీ ఇవ్వాలన్న విషయం మరవరాదు.

ప్రత్యేకంగా ఒక పశువుని ఖుర్బానీ ఇచ్చే స్థోమత లేనివారు 10 లేక ఏడుగురు కలిసి ఒక ఒంటెను ఖుర్బానీ ఇవ్వవచ్చు.

ఏడుగురు  కలిసి ఒక ఆవును ఖుర్బానీ ఇవ్వవచ్చు.

ఏడు కుటుంబాల తరపున ఒంటెను గానీ ఆవును గానీ ఖుర్బానీ ఇవ్వవచ్చును. (ముస్లిం)

పొట్టేలు, గొర్రె, మేక, పోతు వీటిలోని ఏ ఒక్క దానిని ఒకటి కంటే ఎక్కువ కుటుంబాల తరపున ఖుర్బానీ చేయరాదు.
(పాన్చ్ అహమ్ దీనీ మసాయిల్ : 76)

ఖుర్బానీ, అఖీఖా రెండింటి సంకల్పంతో ఒకే పశువుని జిబహ్ చేయటం ప్రవక్త(స) విధానానికి విరుద్ధం. పశువు ఖుర్బానీ చేయటానికి బదులు దాని విలువను నిరుపేదలకు పంచి పెట్టడం ఉత్తమం అనుకోవడం సరికాదు. పశువును ఖుర్బానీ చేయడమే ఉత్తమం. ఇదే ప్రవక్త (స) విధానం అనే విషయాన్ని గ్రహించాలి.

లోపాల నుండి సురక్షితంగా ఉన్న పశువును ఖుర్బానీ కోసం కొన్న తరువాత దానిలో ఏదైనా లోపం కలిగితే ఆ పశువును ఖుర్బానీ చేయటం ధర్మసమ్మతమే. (అల్‌ముఫస్సల్ 76) అయితే స్థోమత గల వ్యక్తి పశువును మార్చుకుంటే మంచిది. వివరణ: అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (ర) (ఒక చోట ఖుర్బానీ కోసం ఉంచబడిన) ఒంటి కన్ను ఒంటెను చూచి ఈ ఒంటె కొన్న తరువాత ఒంటి కన్నుదైపోయి ఉంటే దీనిని ఉంచండి, ఒకవేళ కొనక ముందే ఒంటి కన్నుదై ఉంటే దీన్ని మార్చేయండి అన్నారు. (బైహఖీ- ఖుర్బానీ వ ఈదైన్ 65)

ఖుర్బానీ కోసం కొన్న పశువును ఎలాంటి లోపం లేకున్నా అకారణంగా మార్చడం సరికాదు. అయితే కొన్న పశువు కంటే మంచిది మరొకటి కొనడానికి అలా చేస్తే అభ్యంతరం లేదు.
(అల్ ముఫస్సల్ : 147)

ఖుర్బాని కోసం కొన్న పశువు తప్పిపోయి కనిపించకపోయినా లేదా మరణించినా స్థోమత గల వ్యక్తి మరో పశువుని కొని ఖుర్బానీ చేయాలి. (అల్ ముఫస్సల్ : 119)

గర్భంలో ఉన్న పశువును ఖుర్బానీ చేయవచ్చు (అబూ దావూద్)

ఖుర్బానీ కోసం కొన్న పశువు ఖుర్బానీ ముందు పిల్లను/దూడను కంటే ఖుర్బానీ నాడు తల్లీ బిడ్డ రెండింటినీ ఖుర్బానీ చేయాలి. ఇది ఒక ఖుర్బానీగానే పరిగణించబడుతుంది.
(బైహఖీ, అల్‌ముఫస్సల్ - 135)

## ఖుర్బానీ చేయవలసిన సమయం

జుల్ హిజ్జ మాసపు 10వ తేదీ అనగా పండుగనాడు, పండుగ నమాజు తరువాత నుండి ఖుర్బానీ చేయవలసిన సమయం మొదలవుతుంది.  ఇదే ఖుర్బానీ చేయవలసిన ఉత్తమమైన సమయం. (బుఖారీ, ముస్లిం)

పండుగ నమాజుకు మునుపే పశువును ఎవరైన జిబహ్ చేసినచో అది ఖుర్బానీగా పరిగణించబడదు. ఖుర్బానీ కొరకు ఆ వ్యక్తి మరొక పశువును పండుగ నమాజు తర్వాత జిబహ్ చేయాలి.
(బుఖారీ, ముస్లిం)

జుల్ హిజ్జ పండుగ నమాజు తరువాత నుండి 13 జుల్ హిజ్జ సూర్యాస్తమయం వరకు రేయింబవళ్ళు ఎప్పుడైనా ఖుర్బానీ చేయవచ్చు. (అహ్మద్, ఇబ్నె హిబ్బాన్)

## ఖుర్బానీ చేసే విధానము

జిబహ్ చేసే ముందు కత్తిని బాగా పదును పెట్టాలి (ముస్లిం)

జంతువు ముందు కత్తి నూర రాదు. (బైహఖీ)

పశువును జిబహ్ చేయుట కొరకు ఎడమ వైపునకు పరుండ బెట్టవలెను. (బుఖారీ)

(ఇలా చేస్తే కుడిచేత్తో కత్తి, ఎడమ చేతితో జంతువు తలను పట్టుకొనుటకు వీలు కుదురుతుంది.)

ఆవు, మేక, గొర్రె, పోతు, పొట్టేలులను పడుకోబెట్టి జిబహ్ చేయాలి. ఒంటెను నిలబెట్టి 'నహర్' చేయవలెను.
(బుఖారీ, అల్ హజ్ 36)

పశువును ఖిబ్లా వైపు తిప్పి జిబహ్ చేయాలి. జిబహ్ చేసే వ్యక్తి కూడా ఖిబ్లా వైపు మొహం చేసి జిబహ్ చేయాలి. (అబూ దావూద్)

జిబహ్ చేసే వ్యక్తి తన కాలును పశువు పైభాగాన ఉంచవచ్చు.
(బుఖారి)

జిబహ్ చేసేటప్పుడు పూర్తి శక్తిని ఉపయోగిస్తూ తొందరగా జిబహ్ చేయాలి. (ముస్లిం)

ఖుర్బానీ ఇస్తున్న వ్యక్తి (జిబహ్ చెయ్యటం తెలిసినట్లయితే) తన స్వహస్తాలతో ఖుర్బానీ చేయడం ఉత్తమం. (బుఖారీ)

జిబహ్ చేయుటకు ఇతరుల సహకారం తీసుకోవచ్చు. (బుఖారీ)

ఇతరుల చేత జిబహ్ చేయించుకునే అనుమతి ఉంది. (ముస్లిం)

మహిళలు కూడా జిబహ్ చేయవచ్చు. (బుఖారీ)

పశువును జిబహ్ చేస్తున్నపుడు "బిస్మిల్లాహి అల్లాహు అక్బర్"తో పాటు "అల్లాహుమ్మ ఇన్న హాదా మిన్‌క వ లక, అల్లాహుమ్మ తఖబ్బల్ మిన్నా" అని కూడా చదవవచ్చును. (ముస్లిం, అబూ దావూద్)

"ఇన్నీ వజ్జహ్‌తు వజ్‌హియ లిల్లజీ.." పూర్తి దుఆ కూడా చదవవచ్చునని కొన్ని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తుంది.
(అన్‌ఆమ్ 162-162, అబూ దావూద్)

జిబహ్ చేసే సమయాన జంతువు అదుపు తప్పి తప్పించుకొని పరుగులు తీస్తే షికారు చేసే విధానంలా దాని శరీరానికి ఎక్కడైనా (అల్లాహ్ పేరు స్మరించి) గాయపరచవచ్చు. అందులోనే అది ప్రాణం వదిలితే అది హలాల్‌గానే పరిగణించబడుతుంది. ఒకవేళ ప్రాణాలతో దొరికితే తప్పనిసరిగా జిబహ్ చేయాలి.

## ఖుర్బానీ మాంసం, చర్మం

ఖుర్బానీ మాంసం స్వయంగా తినవచ్చు, ఇతరులకు తినిపించ వచ్చు, భద్రపరుచుకోవచ్చు. (బుఖారీ)

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "వాటిని మీరు తినండి, అడగని అభాగ్యులకు, అడిగే అగత్యపరులకు కూడా తినిపించండి." (హజ్-36)

ఈ వాక్యం ఆధారంగా కొంతమంది పండితులు ఖుర్బానీ మాంసాన్ని మూడు భాగాలుగా విభజించారు. ఒక భాగం ఖుర్బానీ ఇచ్చిన వారి కోసం.

రెండవ భాగం యాచకులు, నిరుపేదలు, అగత్యపరుల కోసం.

మూడవ భాగం తమను కలుసుకునే బంధుమిత్రులకు, ఇరుగు పొరుగు వారి కోసం. ఇలా మూడు భాగాలుగా ఖుర్బానీ మాంసాన్ని విభజించటం ఉత్తమమైన విధానం "వాజిబ్" తప్పనిసరి కాదు.

ఖుర్బానీ మాంసం ముస్లిమేతరులకు కూడా ఇవ్వవచ్చు. (అల్ ముఫస్సల్ 139)

ఈదుల్ అజ్‌హా నాడు పండుగ నమాజు అనంతరం తొలుత ఖుర్బానీ మాంసం భుజించడం ప్రవక్త (స) విధానం. (ముస్లిం)

ధర్మసమ్మతమైన పశువు రక్తం మినహా మిగతావన్నీ ధర్మసమ్మత మైనవే. (మాయిద:3)

ఖుర్బానీ పశువు చర్మం స్వయంగా ఉపయోగించవచ్చు, లేదా ఇతరులకు దానం చేయవచ్చు. చర్మం వలిచే వ్యక్తికి కూలీగా మాత్రం ఇవ్వరాదు. (బుఖారీ, ముస్లిం)

చర్మం వలిచిన వ్యక్తికి (జిబహ్ చేసిన వ్యక్తికి) ఇతరులకు మాంసం పంచినట్లు వీరికి కూడా ఇవ్వవచ్చు, కానీ జిబహ్ చేసినందుకు, చర్మం వలిచినందుకు ప్రత్యేక మోతాదులో మాంసం ఇవ్వటం సమంజసం కాదు.

ఖుర్బానీ చర్మం అమ్మి సొమ్ము చేసుకోకూడదు. (హాకిం) ఒకవేళ అమ్మినా వచ్చిన మొత్తాన్ని సద్‌ఖా చేయవలెను.

## మరణించిన వ్యక్తి పేరిట ఖుర్బానీ చేయటం

మరణించిన వ్యక్తి పేరిట ఖుర్బానీ చేయడం అనే అంశంపై ధార్మిక పండితులు భిన్నాభిప్రాయాలు కలిగి ఉన్నారు.

(1) బలహీనమైన హదీసులను ఆధారంగా తీసుకున్నందువలన, లేదా మరణించిన వ్యక్తి పేరిట ఇది కూడా 'సద్‌ఖా" దానం అని భావించటం వలన మరణించిన వ్యక్తి పేరిట ఖుర్బానీ చేయ వచ్చని కొందరు ధార్మిక పండితులు అభిప్రాయపడ్డారు.

(2) మరణించిన వ్యక్తి మరణానికి ముందు తన కుటుంబంలో ఎవరికైనా 'వసియత్' చేసి ఉంటే అలాంటప్పుడు మరణించిన వ్యక్తి పేరిట ఖుర్బానీ చేయవచ్చుని షరతు విధిస్తారు మరికొంత మంది ధార్మిక పండితులు.

(3) మరణించిన వ్యక్తి పేరిట ప్రత్యేకంగా ఒక పశువుని జిబహ్ చేయరాదు, ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్(స) బ్రతికుండగా వారి సతీమణి ఖదీజ (ర), ముగ్గురు కుమార్తెలు జైనబ్, రుఖయ్యా, ఉమ్మె కుల్సూమ్, పినతండ్రి హంజా (ర) మరణించారు. కాని ప్రవక్త (స) వారెవరి పేరిట ఏ ఒక్క సంవత్సరం ఒక పశువునూ ఖుర్బానీ చేయలేదు.

అయితే 'నా తరపున నా కుటుంబీకుల తరపున' అని ఒక పశువుని ఖుర్బానీ ఇస్తే ఇన్షాఅల్లాహ్ ఖుర్బానీ ఇస్తున్న వ్యక్తికీ, బ్రతికున్న అతని కుటుంబీకులతో పాటు మరణించిన అతని కుటుంబీకులకు కూడా పుణ్యం లభిస్తుంది. మహాప్రవక్త ముహమ్మద్ (స) కూడా ఇలాగే చేసేవారు. ఒక పొట్టేలును ఖుర్బానీ చేస్తూ 'ఓ అల్లాహ్ ఇది నా తరపున నా కుటుంబీకుల తరపున స్వీకరించు' అని ప్రార్థిస్తూ చేసేవారు.

కావున మరణించిన తమ కుటుంబీకులకు పుణ్యం చేకూర్చాలనుకునే వారు ప్రవక్త (స) లాగే వారి విధానాన్ని అనుసరించి ఒక పశువుని తన తరపున తన కుటుంబీకుల తరపున ఖుర్బానీ ఇచ్చుకోవాలి. ప్రవక్త (స) విధానానికి వ్యతిరేకంగా మరణించిన వారి పేరిట ప్రత్యేకంగా పశువు ఖుర్బానీ చేసే అనుమతి లేదని ధార్మిక పండితుల అభిప్రాయం. (అల్లాహు ఆలమ్)

## ముఖ్య విషయాలు

ఖుర్బానీ విశిష్ఠత గురించి వచ్చిన ఉల్లేఖనాలలో అధిక శాతం బలహీనమైనవి. (తొహ్ఫతుల్ అహ్వజీ 5/63)

అలా అనీ ఖుర్బానీ ఇస్లామీయ సంప్రదాయం కాదని చెప్పరాదు. ఖుర్బానీ చేయడం అల్లాహ్ ఆదేశం, ప్రవక్త (స) విధానం. దీనిపై అమలు చేయడంలో తప్పనిసరిగా ఒకటికి ఏడువందల రెట్లు ఎక్కువ పుణ్యం లభిస్తుంది. కానీ బలహీనమైన ఉల్లేఖనాలను ప్రసంగిస్తూ, వాటిని నమ్ముతూ లేక వాటిపైనే ఆధారపడుతుంటారు. కావున గమనించాలని విన్నవించుకుంటున్నాము.

తప్పనిసరి కాకపోయినా అప్పు చేసి మరీ ఖుర్బానీ చేయడం మంచిదని ఇమామ్ ఇబ్ను తైమియా(ర) అభిప్రాయపడ్డారు.

(ఖుర్బానీ వ ఈదైన్ -మునీర్ ఖమర్ 75)

అప్పు చేసి మరీ ఖుర్బానీ చేయడం తప్పనిసరి కాదనే ఒక్క కారణంతో అనేక మంది అప్పు తీర్చుకునే స్థోమత ఉండి కూడా సంవత్సరానికి ఒకసారి మాత్రమే చేసే ఈ పుణ్యానికి దూరంగా ఉండే ప్రయత్నం చేస్తుంటారు. కానీ ఎలాంటి పుణ్యం లభించని అనేక ప్రాపంచిక విషయాల కోసం మాత్రం నిర్భయంగా అప్పులు చేసి కోరికలు తీర్చుకుంటుంటారు. మరి ఇలాంటి విధానము భక్తునికి తగునా? ఆలోచించండి!

## అజ్హా పండుగ విషయాలు

పండుగ నాడు గుసుల్ (స్నానం) చేయడం, సువాసనలు పూసుకోవటం, మంచి బట్టలు ధరించటం ప్రసంశనీయం. (ఇబ్నుమాజ, బుఖారి)

పండుగ నమాజు "ఈద్‌గాహ్"లో చదవాలి. (బుఖారీ)

మహిళలు, పిల్లలు కూడా ఈద్‌గాహ్ వెళ్ళాలి. బహిష్టు స్థితిలో ఉన్న మహిళలు కూడా వెళ్ళాలి కాని నమాజు చదవరాదు, దుఆలో పాల్గొనవచ్చును. (బుఖారీ, ముస్లిం)

అద్‌హా పండుగ నమాజు ఈదుల్ ఫితర్ నమాజుకంటే త్వరగా ముగించాలి. (బుఖారీ, అబూదావూద్)

9వ జుల్ హిజ్జ- అరఫా నాడు ఉదయం నుండి 13 జుల్ హిజ్జ సూర్యాస్తమయం వరకు తక్బీర్లు చదవాలి. (హాకిమ్, ముసన్నఫ్ ఇబ్నె అబీ షైబా)

పండుగకు ఒకదారి గుండా వెళ్తే, తిరిగి వచ్చేటప్పుడు మరొక దారి గుండా రావాలి. (బుఖారీ)

పండుగ నమాజు కొరకు అజాన్, ఇఖామత్ చెప్పనవసరం లేదు. (ముస్లిం)

పండుగ నమాజులో 12 తక్బీర్లు అదనంగా పలుకబడతాయి. మొదటి రకాతులో ఫాతిహాకి ముందు 7తక్బీర్లు, రెండవ రకాతులో ఫాతిహాకి ముందు 5 తక్బీర్లు పలకాలి.

పండుగ నమాజులోని మొదటి రకాతులో సూర ఆలా, రెండవ రకాతులో సూర గాషియా చదవాలి, లేదా మొదటి రకాతులో సూర ఖాఫ్ రెండవ రకాతులో సూర ఖమర్ చదవాలి. (ముస్లిం)

పండుగ నాడు, 11,12,13 జుల్ హిజ్జ తేదీలలో ఉపవాసం ఉండరాదు. (బుఖారీ, అబూదావూద్)

అజ్హా పండుగ నాడు ఈద్గాహ్‌కు ఏమి తినకుండా తక్బీర్లు పఠిస్తూ వెళ్ళాలి. (అల్లాహు ఆలమ్)

**అజాన్** చెప్పడానికి ఎత్తయిన స్థలంలో ఖిబ్లా (కాబా మస్జిద్) వైపు తిరిగి నిలబడాలి. తరువాత రెండు చేతుల చూపుడు వేళ్ళు చెవులలో పెట్టుకొని బిగ్గరగా అజాన్ చెప్పాలి. అజాన్ నమాజ్ వైపు పిలవడానికి చెప్పబడుతుంది.

**అల్లాహు అక్బర్– అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్– అల్లాహు అక్బర్** (నాలుగు సార్లు)

అల్లాహ్ సర్వోన్నతుడు, అల్లాహ్ సర్వోన్నతుడు, అల్లాహ్ సర్వోన్నతుడు, అల్లాహ్ సర్వోన్నతుడు.

**అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్ అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్** (రెండుసార్లు)

సర్వేశ్వరుడైన అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారని నేను సాక్ష్యం పలుకుతున్నాను. సర్వేశ్వరుడైన అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారని నేను సాక్ష్యం పలుకుతున్నాను.

**అష్హదు అన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్ అష్హదు అన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్** (రెండుసార్లు)

ముహమ్మద్ (స) అల్లాహ్ యొక్క సందేశహరులని నేనుసాక్ష్యం పలుకుతున్నాను. ముహమ్మద్(స) అల్లాహ్ యొక్క సందేశహరులని నేను సాక్ష్యం పలుకుతున్నాను.

**హయ్య అలస్సలాహ్ హయ్య అలస్సలాహ్** (రెండుసార్లు)

రండి నమాజ్ వైపునకు. రండి నమాజ్ వైపునకు.

**హయ్య అలల్ఫలాహ్ హయ్య అలల్ఫలాహ్** (రెండుసార్లు)

రండి సాఫల్యం వైపునకు, రండి సాఫల్యం వైపునకు.

**అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్** (రెండుసార్లు)

**లా ఇలాహ ఇల్లల్లాహ్** (ఒకసారి)

అల్లాహ్ సర్వోన్నతుడు– అల్లాహ్ సర్వోన్నతుడు

అల్లాహ్ తప్ప మరే ఆరాధ్య దైవం లేదు.

కేవలం ప్రాతఃకాల అజాన్ పిలుపు (ఫజర్ నమాజ్ వేళ)లో ఒక పాదం అదనంగా (హయ్యఅలల్ఫలాహ్ తర్వాత) పిలవబడుతుంది.

**అస్సలాతు ఖైరుమ్ మినన్నౌమ్ అస్సలాతు ఖైరుమ్ మినన్నౌమ్** (రెండుసార్లు)

నిద్ర కన్నా నమాజ్ మేలైనది.. నిద్ర కన్నా నమాజ్ మేలైనది.




**- ముహమ్మద్ వహీదుద్దీన్**

దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా తెలిపారు :

మీరు అజాన్ వింటున్నప్పుడు ముఅజ్జిన్ పలికే పలుకులే పలకండి. (బుఖారీ)

హజ్రత్ అబూ జుహైఫా (రజి)ఉల్లేఖనం : నేను బిలాల్(రజి)ని అజాన్ ఇస్తుండగా చూశాను. అప్పుడాయన తన చూపుడు వేళ్ళను చెవులలో పెట్టుకున్నారు. హయ్య అలస్సలాహ్, హయ్య అలల్ ఫలాహ్ అని పలికేటప్పుడు తన ముఖాన్ని కుడి ఎడమల వైపునకు తిప్పేవారు. (తిర్మిజీ, ఇబ్నెమాజ, అహ్మద్)

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు : అజాన్, ఇఖామత్‌ల మధ్య ఉండే విరామ సమయంలో చేసే దుఆ త్రోసిపుచ్చబడదు. (నసాయి)

అజాన్ ముగిసిన తరువాత దాన్ని వినేవారు, ప్రకటించే వ్యక్తి (ముఅజ్జిన్) కూడా ఈ దుఆను పఠించాలి.

**అల్లాహుమ్మ రబ్బ హాజిహి ద్దావతిత్తామ్మతి, వస్సలాతిల్ ఖాయిమతి, ఆతి సయ్యిదినా ముహమ్మదనిల్ వసీలత, వల్ ఫజీలత వబ్ అస్హు మఖామమ్మహ్మూద నిల్లజీ వ అత్తహు, ఇన్నక లా తుఖ్‌లిఫుల్ మీఆద్**


తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# మనోవాంఛల దాస్యం జీవితంపై వేసే దుష్ప్రభావం

- ప్రొఫెసర్ సవూద్ ఆలమ్ ఖాస్మీ

**గత సంచిక తరువాయి...**

(4) భౌతికవాది ప్రపంచానికి బానిస అవుతాడు. దురాశపరుడిగా ఉంటాడు. అతనికి పరలోకం గురించి ఆలోచన ఉండదు. దేవునికి జవాబు చెప్పుకోవాలన్న బాధ్యతాభావం కూడా ఉండదు. ప్రాపంచిక జీవితం అతన్ని మోసానికి గురి చేస్తుంది. అతను తన ముగింపు గురించి ఎలాంటి తెలియని స్థితిలో ప్రస్తుత పరిస్థితి పట్ల పూర్తి భ్రమాత్మక సంతృప్తిలో జీవిస్తాడు. దివ్యఖుర్ఆన్ ఇలాంటి వారి గురించి ఏమందంటే -

"ప్రజలు ప్రాపంచిక జీవితపు బాహ్యారూపాన్ని మాత్రమే ఎరుగుదురు. పరలోకం గురించి స్వయంగా వారే ఉపేక్షాభావంతో ఉన్నారు" (రూమ్ : 7)

దివ్యఖుర్ఆన్ మరో చోట ఇలా పేర్కొంది: "వారు పరలోక జీవితం కంటే ఇహలోక జీవితానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వారు ప్రజలను అల్లాహ్ మార్గం నుండి వారిస్తారు. వారు ఈ మార్గం (తమ కోరికలకు అనుగుణంగా) వక్రమైనదిగా కావాలని కోరుతున్నారు. వారు మార్గభ్రష్టత్వంలో చాలాదూరం వెళ్ళిపోయారు."

(ఇబ్రాహీం: 3)

(5) భౌతికవాది దృష్టిలో కేవలం సంపద, ఆస్తిపాస్తులు, భౌతిక వనరులకు మాత్రమే విలువ ఉంటుంది. అతని దృష్టిలో ఆధ్యాత్మిక విలువలకు ప్రాముఖ్యత ఉండదు. వాటిని పనికి రానివిగా భావిస్తాడు. వాటిని ఎగతాళి చేస్తాడు. ఈ వైఖరిని సమీక్షిస్తు దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొంది:

"అవిశ్వాస వైఖరిని అవలంబించిన వారికి ఇహలోక జీవితం ప్రియమైనదిగానూ మనోహరమైనది గానూ కనిపించేలా చేయబడింది. వారు విశ్వాస వైఖరి అవలంబించిన వారిని పరిహసిస్తారు. కాని ప్రళయదినం నాడు భయభక్తులు కలవారే వారి కంటె ఉన్నత స్థానంలో ఉంటారు. ఇక ఐహిక సంపదనైతే, తాను కోరిన వారికి లెక్కలేకుండా ఇచ్చే అధికారం అల్లాహ్‌కే ఉంది." (బఖర: 212)

(6) భౌతికవాది కేవలం సంపన్నులకు మాత్రమే సన్నిహితంగా ఉండడం ఇష్టపడతాడు. ఉన్నవారితోనే సంబంధాలు పెట్టుకుంటాడు. సమాజంలోని నిరుపేదలకు, బలహీన వర్గాలకు దూరంగా ఉండటం మంచిదనుకుంటాడు. పవిత్ర ఖురాన్, దీనికి విరుద్ధంగా, పేదలతో ఉండాలని, వారిపట్ల సానుభూతితో వ్యవహరించడమే నిజమైన మానవత్వంగా చెబుతోంది.

"తమ ప్రభువు ప్రసన్నతను అర్థిస్తూ ఎవరు ఉదయం, సాయంత్రం ఆయనను వేడుకుంటారో, వారి సాహచర్యం పట్ల నీ హృదయాన్ని సంతృప్తి పరచుకో. వారి నుండి నీ దృష్టిని ఏమాత్రం మరల్చకు. నీవు ఇహలోకపు మెరుగులను కోరుకుంటావా? ఎవని మనస్సును మేము మా ధ్యానం పట్ల శ్రద్ధ లేకుండా చేశామో, ఎవడు తన వాంఛలకు అనుగుణంగా వర్తించాడో, ఎవడి పనితీరు అతివాదంపై ఆధారపడి ఉంటుందో అటువంటి వ్యక్తి పట్ల విధేయత చూపకు." (కహఫ్: 28)

(7) భౌతికవాది తన సంపద నుండి తాను మాత్రమే ప్రయోజనం పొందాలనుకుంటాడు. నిరుపేదలకు తన సంపదలో ఎలాంటి హక్కు లేదనుకుంటాడు. అందుకే పేదలకు సహాయపడడం సంపద వ్యర్థం చేయడంగా భావిస్తాడు. ఇలా చేసేవాళ్ళు

మూర్ఖులని అనుకుంటాడు. దివ్యఖుర్ఆన్ భౌతికవాదుల మనస్తత్వాన్ని ఇలా వివరించింది:

“అల్లాహ్, మీకు ప్రసాదించిన ఉపాధినుండి కొంత అల్లాహ్ మార్గంలో కూడా ఖర్చుపెట్టండి అని వారికి చెప్పినపుడు, తిరస్కరించేవారు విశ్వసించేవారితో, “అల్లాహ్ తలిస్తే తానే స్వయంగా ఆహారమివ్వగల వారికి మేము ఆహారమివ్వాలా? మీరు పూర్తిగా మార్గం తప్పిపోయారు” అని అంటారు.”

(యాసీన్: 47)

(8) భౌతికవాది నైతికంగా దిగజారిపోతాడు. నైతిక పతనం, మనస్సులోను, ఆలోచనల్లోను కాలుష్యం చోటు చేసుకుంటుంది. తన బాహ్య వైభవాన్ని, తన పేరుప్రతిష్ఠలు, పలుకుబడి పెంచే వాటిని చేతులు సాచి హత్తుకుంటాడు. వాటి వల్ల అనైతికత, అశ్లీలం, అసభ్యతలు ఎంత పెరిగినా సరే లక్ష్యపెట్టడు. అనైతిక వ్యవహారాలన్నింటిని ఆలింగనం చేసుకుంటాడు. చెడులు, దుర్మార్గాల విషయంలో కూడా వెనక్కి తగ్గడు. ఇలాంటి వారిని దివ్యఖుర్ఆన్ ఇలా వర్ణించింది:

“మీ లౌకిక ప్రయోజనాల నిమిత్తం మీ బానిస స్త్రీలను వేశ్యావృత్తికై బలవంతపెట్టకండి. వారే శీలవతులుగా ఉండగోరినపుడు ఎవరైనా వారిని బలవంతపెడితే, ఆ బలత్కారం తరువాత అల్లాహ్ వారి (బానిస స్త్రీల)ని క్షమించేవాడు, కరుణించేవాడూను.”

(నూర్: 33)

భౌతికవాది ధర్మసమ్మతం, నిషేధాల మధ్య విచక్షణ కోల్పోతాడు. డబ్బు సంపాదించే, సంపదను సేకరించే తపనలో న్యాయాన్యాయాలను పట్టించుకోడు. మంచిచెడుల విచక్షణ ఉండదు. అతని లక్ష్యం ఏ విధంగానైనా సంపదను సేకరించడమే, అందుకే కొలతలు, తూకాల్లో మోసం చేస్తాడు. వడ్డీ వ్యాపారం చేస్తాడు. చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడతాడు. భౌతికవాదం మనిషికి వడ్డీ వ్యాపారం నేర్పుతుంది. ఎందుకంటే ఆదాయాన్ని పెంచుకునే సులభమైన మార్గం. దివ్యఖుర్ఆన్ వడ్డీ వ్యాపారాన్ని తీవ్రంగా ఖండించింది.

“వడ్డీ తినేవారి స్థితి షైతాను పట్టటం వల్ల ఉన్మాది అయిన వ్యక్తి స్థితి లాంటిది. ఈ స్థితికి వారు గురికావటానికి కారణం వారు “వ్యాపారం కూడ వడ్డీలాంటిదేగా” అని అనటమే. వాస్తవానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం (హలాల్) చేశాడు. వడ్డీని నిషిద్ధం (హరామ్) చేశాడు. ” (బఖర: 275)

**(ఇంకా వుంది...)**






# 'జమ్‌జమ్' నీటి ప్రశస్తి

డెస్క్

**'జమ్‌జమ్'** అనేది సౌదీ అరేబియాలోని మక్కాలో ఒక బావి పేరు. లక్షలాది మంది దాహార్తిని అది తీరుస్తుంది. ముఖ్యంగా హజ్ పవిత్ర యాత్ర సమయంలో దేశ, విదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది యాత్రికుల దాహాన్ని తీరుస్తుంది.

జమ్‌జమ్ నీరు ప్రాముఖ్యత ప్రవక్తలయిన ఇబ్రాహీమ్(అ), ఇస్మాయీల్(అ), ముహమ్మద్(స), ఇస్మాయీల్(అ) తల్లిగారయిన హాజిర (అ)లతో ముడిపడి వుంది.

ఇస్లామీయ సంప్రదాయం ప్రకారం ప్రవక్త ఆదమ్(అ) నిర్మించిన దైవగృహాన్ని (బైతుల్లాహ్) ప్రవక్త ఇబ్రాహీమ్(అ) పునర్నిర్మించారు. దానిని నేడు 'కాబా'అని పిలువడం జరుగుతోంది. ప్రపంచంలోని ముస్లింలందరూ రోజుకు ఐదుసార్లు ఈ కాబా (ఖిబ్లా) దిశలోనే నమాజును చేస్తారు. కాబాకు తూర్పున 20 మీటర్ల దూరంలోనే జమ్‌జమ్ నీటి బావి ఉంది. ఈ బావి 35 మీటర్ల లోతుగా ఉంటుంది. పైన సుందరమైన గుమ్మటం నిర్మితమై ఉంది. జమ్‌జమ్ నీటికున్న మహత్యం నేటికి అలాగే ఉంది. సుబ్‌హానల్లా!

ఇతర నీటికి, జమ్‌జమ్ నీటికి మధ్య తేడా వుంది. ముఖ్యంగా కాల్షియం, మెగ్నీషియం జమ్‌జమ్ నీటిలో కాస్త అధికం గనుకనే బాగా అలసిపోయిన హాజీలు సయితం, ఈ జమ్‌జమ్ నీరు తాగి, సేదదీరి ఉత్తేజితులవుతుంటారు. జమ్‌జమ్ నీటికున్న మరో ప్రత్యేకత ఏమిటంటే దాంట్లో ఉన్న 'ఫ్లొరైడ్స్'కు క్రిమినాశక గుణం కూడా ఉంది.

'జమ్‌జమ్ బావి ఆవిర్భవించిన నాటి నుంచి నేటివరకు ఎన్నడూ ఎండిపోలేదు. ఎంతమంది దాహార్తినైనా తీర్చగల సామర్థ్యం ఈ బావికి వుంది. ఎన్ని ఏళ్ళు గడిచినా కూడా జమ్‌జమ్ నీటిలోని లవణాలు, ఖనిజాల మిశ్రమం ఏ మాత్రమూ మార్పు చెందక అవే పాళ్ళలో ఉన్నాయి. కాబాను సందర్శించే ప్రపంచవ్యాప్త హజ్ యాత్రికులు తిరిగి వెళ్ళేప్పుడు జమ్‌జమ్ నీటిని తమతో తీసుకెళుతుంటారు. వారెన్నడూ నీటిలో తేడా గమనించామని ఫిర్యాదు చేయలేదు. అంటే జమ్‌జమ్ నీరు సర్వకాలాల్లో, సర్వావస్థల్లో తన గుణాన్ని కోల్పోలేదని అర్థం. పైగా జమ్‌జమ్ నీటిని రసాయనికంగా శుద్ధి చేయడం, క్లోరిన్ కలపడంగాని జరగలేదు. చాలా బావులలో పాచు, నాచు ఏర్పడడం,

సూక్ష్మజీవులు, వాసన చోటుచేసుకోవడం జరుగుతుంటుంది. కానీ జమ్‌జమ్ బావిలో ఇతర బావులకుండే అవలక్షణాలు ఏవీ లేవు. జమ్‌జమ్ బావి, దాని నీరు చాలా ప్రత్యేకమైనవి.

## జమ్‌జమ్ ఎలా ఆవిర్భవించింది?

క్రీ.పూ. 2000 సంవత్సరాల క్రితం ప్రవక్త ఇబ్రాహీమ్(అ)గారి సతీమణి హాజిర(అ), ఆమె బిడ్డ ప్రవక్త ఇస్మాయీల్(అ)లు ఎడారి ప్రాంతంలో అల్లాడుతుంటే వారి దప్పిక తీర్చడానికి అల్లాహ్‌యే జమ్‌జమ్ బావిని సృష్టించాడని అందరూ నమ్ముతారు. తీక్షణమైన ఎండలో దప్పికతో గొంతెండుకు పోయి ఉండగా హాజిర (అ) సఫా, మర్వా కొండల మధ్య త్రాగు నీరు కోసం ఏడుసార్లు అటూ ఇటూ పరుగులు పెట్టింది. అదే సంప్రదాయాన్ని నేడు ముస్లిం లందరూ తమ హజ్‌యాత్రలో పాటిస్తున్నారు.

ప్రవక్త ఇబ్రాహీమ్(అ) అల్లాహ్ కార్యం నిమిత్తం తన కుటుంబాన్ని అక్కడ బస చేయించారు. హాజిర(అ) ఆ ప్రాంతంలో నీరుందేమో నని వెతుక్కుంటూ వెళ్ళారు. పదేపదే బిడ్డను చూసుకుంటూ, బిడ్డను వదిలి నీళ్ళను వెదుకుతూ ఆమె పడిన తపనను అల్లాహ్ చూశాడు. చివరికి బిడ్డగా ఉన్న ప్రవక్త ఇస్మాయీల్ పాదాల కింద నీటి ఊటను అల్లాహ్ ప్రసాదించాడు.

## ప్రవక్త ముహమ్మద్(స)కు పూర్వం జమ్‌జమ్

జమ్‌జమ్ ఆవిర్భవించాక మక్కా లోయలోని ప్రజలు అక్కడ స్థిరపడ్డం మొదలెట్టారు. ప్రవక్త ఇస్మాయీల్(అ) సంతతి ఆ ప్రాంతంలో అప్పటికే నివసించారు.

కాలం గడుస్తున్నకొద్దీ ఇస్మాయీల్(అ) ఏకైక దైవ సందేశం వెనక్కి తగ్గిపోయి బహు దైవారాధకులకు చోటిచ్చింది. దాంతో నానా రకాల విశ్వాసాలు ప్రబలిపోయాయి. అయినప్పటికీ జమ్‌జమ్ బావి ప్రాముఖ్యత తరాలు మారినా తగ్గలేదు. ప్రవక్త ముహమ్మద్ (స) తాత అబ్దుల్ ముత్తలిబ్ గారికి జమ్‌జమ్ బావి, మక్కాకు వచ్చే హజ్ యాత్రికుల బాధ్యత అప్పగించబడింది.

## శక్తినిచ్చే పానీయం

జమ్‌జమ్ నీటికుండే మహత్తు ఏమిటంటే అది దాహాన్ని మాత్రమేకాక ఆకలిని కూడా సంతృప్తపరుస్తుంది. ప్రవక్త(స) గారి సహచరులలో ఒకరు (సహాబీ) జమ్‌జమ్ నీటిని పూర్వం 'షబ్బాహ్' లేక 'సంతృప్తికారిని' అని పిలిచేవారని తెలిపారు.

ప్రవక్త ముహమ్మద్(స) ''ఈ భువిపై వెలిసిన అత్యుత్తమ నీరు జమ్‌జమ్. దానికి దాహాన్ని, ఆకలిని తీర్చే శక్తే కాకుండా వ్యాధులను మాన్పే గుణం కూడా ఉంది.'' అన్నారు.

హదీసుల ప్రకారం సహాబి అబూ జర్ గిఫ్ఫారి (రజి) ఇస్లాం తొలినాళ్ళలో తొలిసారిగా మక్కాకు వచ్చినప్పుడు నెలరోజుల పాటు తన దాహాన్ని, ఆకలిని జమ్‌జమ్ నీటి ద్వారానే తీర్చుకున్నారు.

## వ్యాధి నివారిణి

జమ్‌జమ్ నీటికి వ్యాధి నివారణ గుణం ఉందని ప్రవక్త(స) చెప్పినందున నేటికీ మక్కా వెళ్ళి హజ్ పవిత్ర యాత్రను పూర్తి చేసుకుని వచ్చే యాత్రికులు స్వదేశంలోని తమ బంధువులు, మిత్రుల కోసం జమ్‌జమ్ నీటిని తీసుకొస్తుంటారు.

ప్రవక్త ముహమ్మద్(స) తోలు సంచిలో జమ్‌జమ్ నీటిని మక్కా నుంచి మదీనాకు తీసుకువెళ్ళేవారు. దారిలో ఆయన వ్యాధిగ్రస్తులపై ఆ నీటిని చల్లి, ఆ నీటిని త్రాగించేవారు.

ముస్లింలలో రెండవ తరానికి చెందిన వహబ్ ఇబ్నె మునబ్బాహ్ ''దైవం మీద ప్రమాణం చేసి చెబుతున్నాను, జమ్‌జమ్ నీరు త్రాగిన వారికి అన్ని రకాల వ్యాధులు నయమవుతాయి. పైగా ఆ నీరు త్రాగినవారికి మంచి ఆరోగ్యం సమకూరుతుంది'' అన్నారు.

## జమ్‌జమ్ నీరు- హజ్ యాత్రికులు

హజ్, ఉమ్రా చేసేవారు తమ యాత్రలో జమ్‌జమ్ నీటి ద్వారా దప్పికను తీర్చుకోవాలని సిఫార్సు చేయబడింది. పైగా వారు స్వదేశానికి తిరిగి వెళ్ళేప్పుడు కుటుంబ సభ్యులు, మిత్రుల కోసం జమ్‌జమ్ నీరును వెంట తీసుకెళతారు. అమెరికాలో విదేశాల పండ్లు, పానీయాలను దిగుమతి చేసుకోవడం నిషిద్ధం. కానీ మక్కా నుంచి తిరిగి వచ్చే పవిత్ర యాత్రికులు తమ ప్రియతముల కోసం జమ్‌జమ్ నీటిని తీసుకురావడానికి మినహాయింపును ఇచ్చారు.

## జపాన్ శాస్త్రజ్ఞుడి పరిశోధన ఫలితం

జపాన్ శాస్త్రజ్ఞుడు మసరు ఎమెటో జమ్‌జమ్ నీటిపై నానో టెక్నాలజీ ద్వారా పరిశోధన జరిపాడు. 1000 చుక్కల సాధారణ నీటిలో ఒక చుక్క జమ్‌జమ్ నీటిని కలిపినా ఆ సాధారణ నీరు సైతం జమ్‌జమ్ నీటి లక్షణాలే పుణికిపుచ్చుకుంటుందని తెలిపారు. ఈ భూమిపై ఏ నీటిలో కన్పించని ప్రత్యేకత జమ్‌జమ్‌కు ఉందని తెలిపాడు. ఒక చుక్క జమ్‌జమ్ నీటిలో ఉండే ఖనిజానికి దానికుండే ప్రత్యేకత దానికుంటుందనీ, అదే ఇతర సాధారణ నీటిలో ఇది ఉండదని తెలిపాడు. కొన్ని పరీక్షల్లో జమ్‌జమ్ నీటిలోని మిశ్రమాల నాణ్యత మారదని, అదెందుకనేది శాస్త్రీయంగా కూడా తెలియదని చెప్పాడు. జమ్‌జమ్ నీటిని రీసైకిల్ చేసినా ఎలాంటి మార్పు లేని శుద్ధత దానిలో గమనించా నని తెలిపాడు.

## జమ్‌జమ్ నీటిపై పరిశోధన

ఈజిప్టుకు చెందిన డాక్టరు ఒకరు 1971లో యూరోపియన్ ప్రెస్‌లో జమ్‌జమ్ నీరు తాగడానికి పనికిరానిదని రాశాడు. బహుశా అది ఆయన ముస్లింలకు వ్యతిరేకంగా సంకుచిత భావంతో రాసి ఉంటాడేమోనని తారిఖ్ హుసేన్ అనుకున్నాడు. అయితే ఈ విషయం రాజు ఫైసల్ చెవిన పడింది. ఆయన కోపగించుకుని ఈ వాదనను అంగీకరించలేదు. పైగా వెంటనే వ్యవసాయం, నీటి వనరుల మంత్రిత్వశాఖకు జమ్‌జమ్ నీటి నమూనాలను యూరోపియన్ ప్రయోగశాలల్లో పరీక్షింపజేసి తాగేందుకు యోగ్యమైనదా, కాదా తెలుసుకోమని ఉత్తర్వులిచ్చారు.

దాంతో ఆ మంత్రిత్వశాఖ జిద్దాలోని పవర్ అండ్ డిసాలినేషన్ ప్లాంట్స్‌కు ఆ కార్యాన్ని అప్పగించింది. అప్పుడు తారిఖ్ హుస్సేన్ డిసాల్టింగ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. సముద్రపు నీటి నుంచి తాగేనీరు తయారు చేసే పని ఆయనది. అప్పుడు జమ్‌జమ్ బావి నీరు ఎలాంటిదన్న ఊహ కూడా ఆయనకు లేదు. వెంటనే మక్కాకు వెళ్ళి అక్కడి అధికారులతో ఏ పని మీద వచ్చింది తెలిపారు. అప్పుడు అక్కడి అధికారులు ఒక సేవకుడిని ఇచ్చి ఏమేమి అవసరమో అవి చూడమన్నారు.

జమ్‌జమ్ బావి వద్దకు వెళ్ళినప్పుడు అది చూసి, ఇంత చిన్న జల ప్రదేశం అది కూడా 18, 14 అడుగుల వెడెల్పు, పొడవు ఉన్న నీటి వనరు లక్షలాది మంది దప్పికను తీరుస్తున్నది, లక్షలాది గ్యాలన్ల నీటిని అందిస్తున్నది అని ఆశ్చర్యపోయాడు. బావి కొలతలు తీసుకొని పరిశోధన ఆరంభించాడు. బావి లోతు ఏమిటో చెప్పమని సహాయకుడిని అడిగాడు. అతడు ముందు బయట స్నానమాచరించి జమ్‌జమ్ బావిలోకి దిగాడు. అతడా బావిలో నిటారుగా నిలుచోగా నీటి స్థాయి అతడి భుజాల మేరకే ఉండడం నేను గమనించాను. అతడి ఎత్తు కేవలం ఐదు అడుగుల ఎనిమిది అంగుళాలే. ఆ తరువాత అతడు ఆ బావి అటూఇటు నిలుచునే తిరిగాడు. కనీసం ఎక్కడ తల మునగనైనా లేదు. ఆ బావిలోకి నీరెక్కడి నుంచి ఎలా వస్తోంది. అడుగున ఏవైన పైపులు ఉన్నాయేమోనని వెతికాడు. బావి అడుగున అలాంటివేవీ లేవని చెప్పాడు.

ఆ తరువాత బావిలో ఒకేచోట నిలుచుని ఉండమని అతడికి చెబితే అతడు అలాగే ఒకేచోట నిలబడ్డాడు. బావిలో ఏమి జరుగుతున్నట్లుందో గమనించమన్నారు. కొద్దిసేపటికి అతడు తన చేతులు పైకెత్తి 'అల్‌హమ్దులిల్లాహ్! కనుగొన్నాను. నా అరికాళ్ళ కింద ఇసుక నాట్యమాడుతున్నట్లుంది. అడుగు నుంచి నీరు ఊటగా వస్తున్నది'' అన్నాడు. పంపింగ్ జరుగుతున్నప్పుడు సైతం బావి అడుగు భాగమంతా ఒకే రీతిలో ఊట ఊరడం అతడు గమనించాడు.''

తారిఖ్ హుసైన్ గమనించాల్సిందంతా గమనించాక నీటి నమూనాలు తీసుకుని యూరోప్ ప్రయోగశాలకు పరీక్ష నిమిత్తం పంపించాడు. మక్కాలో చుట్టుపక్కల బావుల సంగతి కూడా అధికారులను అడిగి తెలుసుకున్నాడు. అయితే అవన్నీ చాలా వరకు ఎండిపోయాయని వారు తెలిపారు. జిద్దాలోని తన ఆఫీసుకు వెళ్ళాక ఏమేమి కనుగొన్నది నివేదిక తయారు చేశాడు. బహుశా జమ్‌జమ్ బావి అంతర్గతంగా ఎర్ర సముద్రంతో సంధానమై ఉండేదేమోనని ఒక అధికారి అన్నాడు. ఎర్ర సముద్రానికి మక్కా 75 కి.మీ. దూరంలో ఉంది. పైగా మక్కాలోని ఇతర బావులు చాలావరకు ఎండిపోయాయి. అలాంటి స్థితిలో జమ్‌జమ్ బావి అంతర్గతంగా ఎర్ర సముద్రంతో సంధానమై ఉండడం ఎలా సాధ్యం.

## జమ్‌జమ్ నీటి నమూనాలను యూరోప్ ప్రయోగశాలలు పరీక్షించాయి.

- జమ్‌జమ్ నీటిలో కాల్షియం, మెగ్నీషియం లవణాలు ఇతర నీళ్ళలో కంటే ఎక్కువ ఉన్నాయి. అందుకే హాజీలకు జమ్‌జమ్ నీళ్ళు పునరుత్తేజితులను చేస్తుంది.
- జమ్‌జమ్ నీటిలో క్రిమినాశని అయిన ఫ్లోరైడ్ కూడా ఉంది.

యూరోప్ ప్రయోగశాలలు జమ్‌జమ్ నీరు త్రాగుటకు ఉపయుక్తమయినదనే తెలిపాయి. దాంతో రాజు ఫైసల్ ఎంతో ఆనందించాడు. యూరొపియన్ ప్రెస్ వ్యతిరేకంగా రాసినందుకు మందలించాడు. జమ్‌జమ్ నీటి మహత్తుపై మరిన్ని ప్రయోగాలు జరగాల్సి వుంది.

## జమ్‌జమ్ ప్రత్యేకతలు

- జమ్‌జమ్ బావి ఎన్నడూ ఎండిపోలేదు. ఎంతమందికైనా నీటిని అందించే సామర్థ్యం కలిగివుంది.
- జమ్‌జమ్ ఆవిర్భవించిన నాటి నుంచి నేటివరకు దానిలోని లవణాలు, రుచి ఒకేలా ఉన్నాయి.
- జమ్‌జమ్ నీటిని ప్రపంచమంతటా ఎక్కడికైనా తీసుకెళ్ళవచ్చు. ఆరోగ్యపరమైన ముప్పులేదు.
- సాధారణంగా మాములు నీరు వేర్వేరు ప్రదేశాలలో వేర్వేరు రుచులలో ఉంటుంది. కానీ జమ్‌జమ్ నీటిని ఏ ప్రదేశానికి తీసుకెళ్ళినా అదే రుచి కలిగి వుంటుంది.
- జమ్‌జమ్ నీటిని రసాయనికంగా శుద్ధి చేయడం లేక క్లోరిన్ కలపడం వంటిదేదీ ఉండదు. జమ్‌జమ్ బావిలో నాచు, పాచు వంటివేమి పెరగవు. పైగా వాసన సమస్య ఉండదు.

- యం.ఏ ఆరీఫ్, కొత్తగూడెం



# బంధుత్వాలు- మానవతా విలువలు

**ఒక** వ్యక్తి వీధి గుండా వెళుతున్నాడు. అప్పుడు ఒక పది సంవత్స రాల పాప ఇంటి గుమ్మం దగ్గర కూర్చుని ఎదురింటి వైపు చూస్తూ ఏడుస్తూ ఉంది. అప్పుడు ఆ వ్యక్తి ఎందుకు ఏడుస్తున్నావని అడిగాడు. ఆ పాప ఏమి చెప్పలేక ఎదురింటి వైపు చూస్తూ ఏడుస్తూ ఉంది.

ఆ వ్యక్తి ఎదురింటి వైపు చూసాడు. ఎదురింటి వాళ్ళ ఇల్లు సందడిగా ఉంది.

ఆ ఇంట్లో వారు లగేజీలు తీసుకుని ఊరికి బయలుదేరు తున్నారు. అప్పుడు అర్థం అయ్యింది అతనికి, వేసవి సెలవులు ఇచ్చారు కదా ఊరెళుతున్నారు అని.

నీకు ఎవరూ లేరా అని అడిగాను. చాలా మంది బంధువులు ఉన్నారు. కానీ, నాకు నాన్న లేడు, మా నాన్న చనిపోయాక బంధువులు మమ్మల్ని పట్టించుకోవడమే మానేసారు. వేసవి సెలవులు ఇచ్చారు కదా అందరూ తమ తమ బంధువుల ఇళ్ళకు వెళుతున్నారు. నాకు కూడా వెళ్ళాలని ఉంది. కానీ, ఎవరూ పిలవరు. అందుకే ఏడుస్తున్నాను అన్నది ఆ పాప. కళ్ళల్లో నీళ్ళు తిరిగి ఆ పాప వాళ్ళ అమ్మతో మాట్లాడి తన ఇంటికి తీసుకొని వెళ్ళాడు.

మన కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతున్నట్లు అనిపిస్తోంది. కుటుంబ వ్యవస్థ చెదిరిపోవడానికి ప్రధాన కారణం స్వార్థం. బంధువులైనా, కుటుంబ సభ్యులైనా కరిగిపోయే సంపద కోసం ఘర్షణ పడవల్సిందేనా?

ఘర్షణ వాతావరణంలో పుట్టి పెరగడం వల్ల చాలా మటుకు పిల్లలు చిన్నప్పటి నుండే నేర మనస్తత్వాన్ని కలిగి ఉంటున్నారు. ఆస్తి కోసం అన్న చెల్లెను, తల్లిదండ్రులను చంపుతాడు. మనషుల మధ్య ప్రేమానురాగాలు సన్నగిల్లుతున్నాయనడానికి వీళ్ళే ఉదాహరణ. ఈ పరిస్థితి ఎందుకు వస్తుంది. సొంత కుటుంబ సభ్యులు కూడా డబ్బు తర్వాతేనా? మనిషన్నవాడు మాయమై పోతున్నాడా? ఏమిటి ఇది? లోపం ఎవరిలో? రక్త సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనా? అయిన వారు కూడా ఆస్తిపాస్తుల తర్వాతేనా? మానవత్వం దారుణంగా తగ్గుతుంది అంటే, కనుమరుగై పోతుందా అంటే అవును అనే అనాలి. సమాజంలో మానవత్వం అనేది మంట కలిసిపోతుంది. ఆస్తి తగాదాలలో పడి డబ్బు కోసం, ఆస్తుల కోసం కన్న బంధాలను, బంధుత్వాలను మరిచిపోతున్నారు.

ప్రస్తుత కాలంలో సమాజంలో డబ్బుకి ఉన్న విలువ బంధాలకి

బంధుత్వానికి లేదు. ఆర్థికపరమైన గొడవలు వచ్చినప్పుడు బంధాలు, బంధుత్వాలు గుర్తుకురావడం లేదు. ఆస్తి కోసం రక్త సంబంధీకులని  కూడా చూడకుండా కక్ష పెంచుకొని మరీ చంపుతున్నారు. అన్యోన్యంగా కలిసి మెలిసి ఉండాల్సిన కుంటుబ సభ్యులే ఆస్తుల కోసం కలబడుతున్నారు.

రక్షణగా ఉండాల్సిన రక్తసంబంధీకులే కాలయములుగా మారి కాటికి పంపుతున్నారు. ఒకే కడుపున పుట్టిన అన్నదమ్ములు జానెడు భూమి కోసం ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. ఆస్తి గొడవల్లో ఒక ఇంచు స్థలం కోసం అన్నదమ్ములు గొడవపడి కోర్టుకు ఎక్కుతున్నారు.

ఈ రోజు మన సమాజంలో నైతిక విలువలు అన్నీ పతనమై పోతున్నాయి, బంధుత్వ విలువలు చాలా దిగజారిపోయాయి.

ఎక్కడ ఉన్నాయి బంధాలు ఈ రోజు? డబ్బుంటే ఏదైనా కొనవచ్చు కానీ, డబ్బుతో బంధాలను కొనలేము.

సృష్టి రాశులను అన్నిటినీ సృష్టించిన తర్వాత అల్లాహ్ బంధుత్వాలను కూడా సృష్టించాడు అని దైవప్రవక్త  ముహమ్మద్ (స) అన్నారు.

బంధుత్వం అల్లాహ్ చుట్టూ ఏడుస్తూ తిరుగుతూ ఉంటుంది.

అప్పుడు అల్లాహ్ అడుగుతాడు "బంధుత్వమా ఎందుకు ఏడుస్తున్నా"వని,

"ఓ అల్లాహ్ ఎవరైనా నన్ను తెంచుకుంటే నేను తట్టుకోలేను"


అప్పుడు అల్లాహ్ అంటాడు "బంధుత్వమా నిన్ను త్రెంచుకున్న వాడు నన్ను కూడా త్రెంచుకున్నట్టే, వాడు నరకంలో ప్రవేశిస్తాడు" అని అల్లాహ్ చెప్పాక బంధుత్వం శాంతించింది.

రక్త సంబంధీకులతో సంబంధాలు విచ్ఛిన్నం చేసుకునే మనిషి సమాజంలోని ఇతర  మానవుల పట్ల మంచిగా ఉంటాడని నమ్మలేము. ఒక వ్యక్తి దైవప్రవక్త సన్నిధికి వచ్చి నరకం నుండి దూరం చేసి స్వర్గానికి పోయే ఆచరణ గురించి నాకు చెప్పండి అన్నాడు. అప్పుడు దైవప్రవక్త ఇలా అన్నారు. బంధువు లతో సత్సంబంధాలు కలిగి ఉండు అన్నారు.

దేవుడిని అంతిమ దినాన్ని విశ్వసించిన వ్యక్తి తన బంధువులతో సత్సంబంధాలు కలిగి ఉండాలి. తల్లిదండ్రుల పట్ల, బంధువుల పట్ల అనాథల పట్ల సద్భావంతో మెలగండి అని ఖురాన్ బోధిస్తుంది.

సామాజిక వ్యవస్థలో బంధువులతో సత్సంబంధాలు ఎంతో ముఖ్యం. దైవప్రవక్త ఒక సందర్భంలో ఇలా అన్నారు. ఎవరైనా తన ఉపాధిలో సమృద్ధిని, ఆయుష్షులో  పెరుగుదలను కోరుకుంటే అతను తన బంధువుల పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండాలి.

రక్త సంబంధీకులతో మీకేర్పడిన సహజ బాంధవ్యాన్ని త్రెంచకండి. దేవుడు మీ చర్యల్ని ఓ కంట గమనిస్తున్నాడన్న సంగతి మరిచి పోకండి అని ఖురాన్‌లో చెప్పబడింది. ఇప్పటికే ఈ ఆస్తి తగాదాల కారణంగా ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇప్పటికీ రోజూ ఏదో ఒక ప్రదేశంలో ఈ ఆస్తి తగాదాల కారణంగా హత్యలు జరుగుతూనే ఉన్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే రక్త సంబంధాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. బంధుత్వాన్ని త్రెంచేవాడు స్వర్గంలో ప్రవేశించలేడు అని దైవ ప్రవక్త ముహమ్మద్ (స) అన్నారు. అందువల్ల బంధువుల హక్కులు నెరవేర్చండి, బంధువులను గౌరవించాలి, ఆదరించాలి. కుటుంబం అంటేనే రక్త సంబంధంతో కూడి ఉంటుంది. ఆస్తుల కన్నా రక్త సంబంధాలు గొప్పవి.




తల్లిదండ్రులు తమ పిల్లలకు దైవభక్తి పిల్లల హృదయంలో పుట్టించాలి. కుటుంబ సంబంధాలను, బంధుత్వ  సంబంధాలను, పొరుగు సంబంధాలను పిల్లలకు పరిచయం చేయాలి. ప్రేమా, ఆప్యాయత పిల్లలకు నేర్పాలి. పిల్లలకు చిన్నప్పటి నుండే సంబంధాలు, ప్రేమా ఆప్యాయతలు, విలువల గురించి చెప్తే కొన్నాళ్ళకు వ్యవస్థ మారవచ్చు.

దైవం అందరికీ సద్బుద్ధిని, సన్మార్గాన్ని ప్రసాదించాలని కోరుకుందాం.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**